జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 17 విశాఖపట్నం | శుక్రవారం 31 అక్టోబరు 2021 | 8 పేజీలు | వెల : 5.00



## అతి విశ్వాసం వద్దు..

### కష్టపడి అత్యధిక మెజార్టీతో వైసీపీని గెలిపించండి.. బద్వేల్ నేతలకు సీఎం జగన్ సూచన

అమరావతి, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: కడప జిల్లా బద్వేల్ ఉప ఎన్నికపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏర్పాటు చేశారు. తాడేపల్లిలో క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా వెంకటసుబ్బయ్య అకాల మరణంతో బద్వేల్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఆయన సతీమణి దాసరి సుధను తమ పార్టీ తరపున అభ్యర్థిగా నిలబెడుతున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. బద్వేల్ నియోజకవర్గ గెలుపు బాధ్యతలను సమావేశానికి వచ్చిన నేతలందరికి అప్పగించారు సీఎం. (మిగతా 2లో..)

# పోటీయా.. సేఫ్ ఎగ్జిటా..?




కడప, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి:బద్వేల్ ఉపఎన్నికల్లో వైసీపీ విపక్షాలకు ఓ ఆఫర్ ఇచ్చింది. సంప్రదాయాలను గౌరవిస్తూ బద్వేలులో పోటీకి దిగకుంటే మంచిదన్నది ఆ ఆఫర్ సారాంశం. ముందే అభ్యర్థిని ప్రకటించిన టీడీపీ.. ఆ ఆఫర్‌ను స్వీకరించి పోటీ, ప్రచారం జంఝాటాలు లేకుండా గౌరవంగా తప్పుకొంటుందా? లేక తిరుపతిలాగే సై కొడుతుందా? అనారోగ్యంతో ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్య మృతి చెందడంతో కడప జిల్లా బద్వేలులో ఉపఎన్నిక అనివార్యమైంది. అక్టోబర్ 30న ఇక్కడ ఉపఎన్నిక నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. బద్వేల్ ఉపపోరుపై ఇప్పటి వరకు పెద్దగా చడీచప్పుడు లేదు. రాష్ట్రంలో వైసీపీ బలంగా ఉండటంతో విపక్షపార్టీలు అక్కడ పెద్దగా దృష్టి పెట్టిందీ లేదు. పైగా ఇది సీఎం జగన్ సొంత జిల్లాలో జరుగుతున్న ఉపఎన్నిక. 2019 ఎన్నికల్లో బద్వేల్‌లో వైసీపీకి 44 వేల ఓట్ల మెజారిటీ దక్కింది.ప్రస్తుత ఉపఎన్నికల్లో దివంగత ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య భార్య సుధ వైసీపీ నుంచి బరిలో దిగుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన ఓబుళాపురం రాజశేఖరే మరోసారి టీడీపీ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ-జనసేన, కాంగ్రెస్ పోటీ చేస్తాయో లేదో ఇంకా చెప్పలేదు. సంప్రదాయాలను అనుసరించి బద్వేల్‌లో పోటీ లేకపోతే బాగుంటుందని వైసీపీ అభిప్రాయపడింది. కానీ.. టీడీపీ అభ్యర్థిని ప్రకటించడంతో పోటీ అనివార్యంలా కనిపిస్తోంది. నామినేషన్ల దాఖలకు ఇంకా సమయంలో ఉండటంతో ఆలోగా టీడీపీ మనసు మార్చుకుంటుందా లేదా అన్నది ఒక చర్చ. టీడీపీ విత్ డ్రా అయితే మిగతా పక్షాల మాటేమిటి? 2019 జనరల్ ఎలక్షన్స్ తర్వాత ఏపీలో తిరుపతి లోక్‌సభకు ఉపఎన్నిక జరిగింది. వైసీపీ ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ అకాల మరణంతో బైఎలక్షన్ వచ్చింది. తిరుపతిలో ఏ పక్షమూ సంప్రదాయాలను పాటించలేదు. వైసీపీ, టీడీపీ, బీజేపీ-జనసేన ఉమ్మడిగా, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ పడ్డారు. ఆ బైఎలక్షన్‌లో వైసీపీ గెలిచింది. అయితే వైసీపీ అనుకున్నంత మోజారిటీ రాలేదు. టీడీపీకి కూడా ఓట్లు గణనీయంగానే పోలయ్యాయి. అప్పుడే (మిగతా 2లో..)

# కరోనాతో గుణపాఠాలు నేర్చాం..: మోదీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: దేశంలో ప్రతి మూలకూ వైద్య సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమని.. దీనికోసమే సరికొత్త జాతీయ ఆరోగ్య విధానానికి నడుంబిగించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కరోనా మహమ్మారి గుణపాఠం నేర్పిందని.. దీని మూలంగా వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలకు పూనాది ఏర్పడిందన్నారు. కరోనాను అరికట్టేందుకు, ఎదుర్కొనేందుకు అన్ని దేశాలు నిమగ్నమయ్యాని.. ఈ తరుణంలో భారత్ బలాన్ని, స్వశక్తి పెంచుకునేందుకు వుందడుగువేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అత్యాధునిక ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించడమే తమ లక్ష్యమని.. అందుకే వైద్య కళాశాలలను విస్తరిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ప్రధాని మోదీ గురువారం రాజస్థాన్‌లో నాలుగు కొత్త వైద్య కళాశాలలకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. దీంతోపాటు జైపూర్ సీతాపురలో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ టెక్నాలజీ (%ఘ%) ని కూడా ఆయన ప్రారంభించారు. మెడికల్ కాలేజీలను కొత్తగా రాజస్థాన్‌లోని బన్స్‌వారా, సిరోహి, హనుమాన్‌గఢ్, దౌసాలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీలు, ఇనిస్టిట్యూట్ గురించి ప్రెజెంటేషన్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దేశ ఆరోగ్య రంగాన్ని పూర్తిగా మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. విద్యా రంగం నుంచి వైద్య రంగానికి అనుసంధానంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. స్వచ్ఛ భారత్ అభియాన్, ఆయుష్మాన్ భారత్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ మొదలైనవి సంస్కరణల్లో భాగమేనని ప్రధాని మోదీ అన్నారు. కోరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా (మిగతా 2లో..)

## బద్వేలు బైపోల్స్‌లో...
# జనసేనతో బీజేపీ పొత్తు..
### క్లారిటీ ఇచ్చిన సోము వీర్రాజు



కడప, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: జిల్లాలోని బద్వేలు అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో బీజేపీ-జనసేన పార్టీలు కలిసే పోటీ చేస్తాయని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టంచేశారు. బద్వేలు అసెంబ్లీ ఉప ఎన్నిక అంశంపై బీజేపీ, జనసేన పార్టీ నేతలు సమావేశమై చర్చించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో (మిగతా 2లో..)

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్



BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
— డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

## నూతన సీఎస్‌గా ...
# బాధ్యతలు స్వీకరించిన సమీర్ శర్మ



అమరావతి,సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ కొత్త సీఎస్‌గా సమీర్ శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సమీర్ శర్మకు పాత సీఎస్ ఆదిత్యనాథ్ బాధ్యతలు అప్పగించారు. తొమ్మిది నెలలపాటు ఆదిత్యనాథ్ దాస్ ఏపీ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమీర్ శర్మ మీడియాతో మాట్లాడారు. "నవరత్నాల అమలు కోసం కృషి చేస్తా. సీఎస్‌గా నాకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జనగ్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. అందరి సహకారంతో పని చేస్తాను" అని తెలిపారు.



## పోసాని ఇంటిపై రాళ్ల దాడి..

హైదరాబాద్: సినీ నటుడు, వైసీపీ అభిమాని పోసాని కృష్ణమురళి ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలోని పోసాని ఇంటిపై బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో రాళ్లతో దాడి చేశారు. పోసానిని దుర్భాషలాడుతూ వీరంగం సృష్టించారు. దీంతో భయాందోళనకు గురైన వాచ్‌మన్.. ఎస్‌ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాచ్‌మన్ ఫిర్యాదుతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు.జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని బూతుల వర్షం కురిపించడంతో జనసేన కార్యకర్తలు-పోసాని మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. (మిగతా 2లో..)

# పీసీసీ చీఫ్ రాజీనామాపై సిద్ధూ పునరాలోచన!



పంజాబ్, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి:పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన నవజ్యోత్‌సింగ్ సిద్ధూ కాస్త మెత్తబడుతున్నాడు. పీసీసీ చీఫ్ పదవికి చేసిన రాజీనామాపై పునరాలోచన చేస్తానని తెలిపాడు సిద్ధూ. పంజాబ్ ముఖ్యమంత్రి చరణ్‌జీత్‌సింగ్ చన్నీతో సమావేశం తరువాత ఇద్దరి మధ్య రాజీ కుదిరినట్లు సమాచారం. సిద్ధూ లేవనెత్తిన చాలా డిమాండ్లకు సీఎం చన్నీ అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో సిద్ధూ కాస్త వెనక్కు తగ్గినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, అక్టోబర్ 4న జరిగే పంజాబ్ కేబినెట్ సమావేశం తరువాత సిద్ధూ డిమాండ్లపై సీఎం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లను పదవులను నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు నవజ్యోత్ సింగ్ సిద్ధూ.సిద్ధూ డిమాండ్లకు అనుగుణంగా పంజాబ్ డీజీపీతో పాటు ఆ రాష్ట్ర ప్రస్తుతఅడ్వొకేట్ జనరల్‌ను కూడా మార్చే అవకాశాలున్నాయి. పంజాబ్ పోలీసు చీఫ్‌గా ఇక్బాల్ ప్రీత్ సింగ్ సహోటాను తొలగించవచ్చు. అతను 2015 లో జరిగిన ఘటనకు సంబంధించి అకాలీదళ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి అధిపతిగా ఉన్నాడు. అంతేకాదు గురు గ్రంథ్ సాహిబ్‌ను అవమానించడాన్ని నిరసిస్తున్న వారిపై పోలీసు కాల్పుల ఘటనకు ప్రధాన కారకుడని సిద్ధూ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనను తొలగించాలని సిద్ధూ పట్టుబడతున్నారు. (మిగతా 2లో..)

# నరసరావుపేట పట్టణంలో కదం తొక్కిన తెలుగు రైతులు





నరసరావుపేట, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట పట్టణంలో గురువారం రైతు కోసం తెలుగుదేశం కార్యక్రమంలో కదం తొక్కిన తెలుగు రైతన్నలు, పట్టణంలో ట్రాక్టర్, ఎద్దుల బండ్లలతో బారి ర్యాలీ కొనసాగింది ముందుగా గుంటూరు రోడ్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి సత్యనపల్లి రోడ్ మీదుగా మల్లమ్మ సెంటర్, గాంధీ చౌక్, గడియారం స్తంభం సెంటర్, మునిసిపల్ కార్యాలయం మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినా హామీలు అమలు చేయాలని, పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ర్యాలీలో దారి పొడవునా పలు నినాదాలు చేశారు పన్నుల రూపంలో భారం వేస్తున్నా మోడీ, జగన్ ప్రభుత్వన్నీ ప్రజలు క్షమించరని, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి రైతులకు కన్నీళ్ళు పెట్టిస్తోన్న మోడీ ప్రభుత్వనికి ప్రజలు సరైన సమయంలో సారైనా సమాధానం చెబుతారని హెచ్చరించారు, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, ప్రతిభ వంతుల రాష్ట్ర మాజీ టీడీపీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అలాగే సమైఖ్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యన్ కె. జిలానివమాలిక్ మద్దతు తెలియజేశారు అదేవిదంగా పట్టణ టీడీపీ అధ్యక్షులు కడియాల రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్, రొంపిచర్ల మండలం టీడీపీ అధ్యక్షులు వెన్నా బాలకోటి రెడ్డి, నరసరావుపేట మండలం టీడీపీ అధ్యక్షులు విస్వేస్వరావు, నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ మహిళా అధ్యక్షరాలు దాసరి ఉదయశ్రీ, రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి జాన్నవి, నరసరావుపేట పట్టణ టీడీపీ మహిళా అధ్యక్షరాలు కదం నాగ జ్యోతి, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కడియం కోటి సుబ్బారావు, నరసరావుపేట నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కొల్లి వెంకటేశ్వర్లు, నరసరావుపేట పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మేత కోటి రెడ్డి, నరసరావుపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పులిమి రామిరెడ్డి,నరసరావుపేట పార్లమెంట్ కార్యదర్శి కొట్టా కిరణ్, ముస్లిం మైనారిటీ నాయకులు మన్నన్ షరీఫ్, యార్డు వలి, బడే బాబు, ఖాలీల్, రఫీ, ఆయా గ్రామాల తెలుగు రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు పోలీసులకు – నాయకులు,కార్యకర్తలకు పది నిమిషాలు తోపులాట జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు

# జీతాలు అడిగితే కార్మికులపై పోలీసు కేసులు పెడతామని బెదిరిస్తున్నారు




తూర్పుగోదావరి,ప్రజాపాలన ప్రతినిధి : ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ది. 30.09.2021న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నానుద్దేశించి ఎఐసిసిటియు రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, అఖిలభారత వ్యవసాయ%--% గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలలో కాంట్రాక్టు %ఽ% అవుట్ సోర్సింగ్ పద్దతిలో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఇతర కార్మికులు పనిచేస్తున్నారని, కరోనా తరంగానికి భయపడి రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు సైతం మూసివేస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసన్తా, ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచుతూ కరోనా రోగులున్న అత్యవసర విభాగాలలో సైతం పనిచేసిన కార్మికులకు ఈ ప్రభుత్వాలు మొండి చేయి చూపాయని అన్నారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకునేటప్పుడు కార్మికులకు జీతాలు చెల్లింపులో ప్రభుత్వం నుండి నిధులు విడుదలలో జాప్యం జరిగినా దానితో ఎలాంటి సంబంధం లేకుండా 6 నెలలపాటు ఆటంకం లేకుండా జీతాలు ఇవ్వటానికి వారు హామీపడతారని, కానీ నేటికీ నెలలు గడుస్తున్నా కార్మికులకు జీతాలు చెల్లించటం లేదు సరికాదా, పాతబకాయిలు కూడ ఇంకా ఇవ్వలేదని దీనివలన కార్మికులు అనేక అర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం కార్మికులకు చెల్లించవలసిన బకాయిల్ని పూర్తిగా చెల్లించాలని, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ,ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు జీతాలు పెంచమని, ఇ.ఎస్. ఐ, పి.ఎఫ్ కట్టమని అడిగితే కాంట్రాక్టర్లు కార్మికుల్ని పనిలోనుండి తొలగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి పారిశుధ్య, సెక్యూరిటీ ఇతర కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచి ప్రభుత్వమే వారి ఖాతాలలో జమ చేయాలని, అలాగే గౌరవ వేతనం పొందే ఆశా, మిడ్డే మీల్స్, అంగన్వాడి లాంటి స్కీమ్ వర్కర్స్, స్కూల్స్, పంచాయతీ పారిశుధ్య కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విప్లవ యువజన సంఘం ( అర్ వై ఎ) రాష్ట్ర కన్వీనర్ కె జనార్ధన్ మాట్లాడుతూ కరోనా బారినపడిన వ్యవసాయ కార్మిక కుటుంబాలకు లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం సహాయం చేయాలని, పారిశుధ్య కార్మికులకు రూ.10 లక్షలు ఆరోగ్యభీమా, రూ. 50 లక్షలు జీవితభీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు మాట్లాడుతూ పిఠాపురం అర్బన్ లో పి.హెచ్.సి కాంట్రాక్టరుగా ఇప్పటివరకు కొనసాగిన “ధనుష్” సంస్థ 9 నెలలు జీతం ఇవ్వకుండా కార్మికుల్ని రోడ్డుపాలు చేసారని, జీతాలు అడిగిన కార్మికులపై పోలీసు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణం జోక్యం చేసుకుని కార్మికులకు రావాల్సిన బకాయిల్ని ఇప్పించి, న్యాయం చేయాలని, రూరల్ పి.హెచ్.సి లో కొనసాగుతున్న “ధనుష్” కాంట్రాక్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పై డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టరు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రేచుకట్ల సింహాచలం, అయార్లా జిల్లా కార్యదర్శి యమ్. లచ్చబాబు, ఐప్వా రాష్ట్ర, జిల్లా నాయకులు కాకర రత్న కుమారి, వల్లూరి నాగమణి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నరసరాజు, జిల్లా కమిటీ సభ్యులు పిల్లా చంద్రం, జన సంస్కృతి మండలి జిల్లా అధ్యక్షుడు యన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోసాని ఇంటిపై రాళ్ల దాడి..

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో పోసాని ఇంటిపై దాడి జరగడం సంచలనం సృష్టిస్తోంది. నిజానికి పోసాని కృష్ణమురళి కుటుంబం 8 నెలలుగా వేరే చోట నివాసం ఉంటోంది. ఆ విషయం తెలియని దుండగులు, పోసాని ఎల్లారెడ్డిగూడలోని ఇంట్లోనే ఉంటున్నారనుకుని దాడికి పాల్పడ్డారు. పోసానిని బూతులు తిడుతూ రాళ్లు, ఇటుకలు విసిరారని పోలీసులతో ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## కరోనాతో గుణపాఠాలు నేర్చాం..: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య రంగంలో చాలా గుణపాఠాలు నేర్పిందన్నారు. ఈ సమయంలో భారతదేశం స్వశక్తితో మహమ్మారిని ఎదుర్కొందని తెలిపారు. అనంతరం ఆరోగ్య సేవలను విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనిలో భాగంగా కేంద్రం ఉచిత టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిందని.. అందరికీ వ్యాక్సినేషన్ అందించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటివరకు దేశంలో 88 కోట్లకు పైగా వ్యాక్సిన్ డోసులు ఇచ్చినట్లు వెల్లడించారు.

## సీఎం జగన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పాల దంపతులు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి , సెప్టెంబర్ 30: కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక– రాము దంపతులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) తో కలిసి సీఎం వైఎస్ జగన్ కు పుష్పగుచ్ఛం అందజేశారు. జెడ్పి చైర్ పర్సన్ గా అవకాశం కల్పించడం పట్ల ఉప్పాల దంపతులు సీఎం వైఎస్ జగన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఉప్పాల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి: నరసరావుపేట ఆర్టీసీ డి ఎం అబ్దుల్ సలాం



నరసరావుపేట, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: ఏపీఎస్ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ అబ్దల్ సలాం తెలిపారు. గురువారం డిపోలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పట్టణ మరియు పరిసర గ్రామ ప్రజలకు శుభవార్త. ఏపీఎస్ఆర్టీసీ వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కార్గో డోర్ డెలివరీ సర్వీసుకు కస్టమర్ల నుంచి మంచి స్పందన వచ్చుచున్నదని అన్నారు . అన్నీ కార్గో కౌంటర్ల నుండి జిల్లా కేంద్రాలైన గుంటూరు మచిలీపట్నం, ఏలూరు, కాకినాడ ,విశాఖపట్నం, శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, విజయనగరం మరియు విజయవాడ రాజమండ్రి, తిరుపతి నగరములకు డోర్ డెలివరీ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు ఈ యొక్క అవకాశం ఇప్పటివరకు పది కేజీల వరకు ఉన్నది . తేదీ 01-10-2021 నుండి 50 కేజీల వరకు డోర్ డెలివరీ సదుపాయం కల్పించడం అయినది డోర్ డెలివరీ సదుపాయం యొక్క రేట్లు వివరములు 0-1కేజీ వరకు 15రూ” ౦%+ూ% అదనం ొ18 రూ” 1 కేజీ నుండి 6 కేజీల వరకు 25 రూ”౦%+ూ% అదనరొ30 రూపాయలు. 6 కేజీల నుంచి 10 కేజీల వరకు 30రూపాయలు ౦%+ూ%అదనరొ 36రూపాయలు 10 కేజీల నుంచి 25 కేజీల వరకు 40 రూపాయలు ౦%+ూ%అదనరొ 48 రూపాయలు. 25 కేజీల నుంచి 50 కేజీల వరకు 50 రూపాయలు ౦%+ూ% అదనంొ 59 రూపాయలు గా నిర్ణయించినారు కావున నరసరావుపేట పట్టణ మరియు పరిసర గ్రామాల ప్రజలు ఈ యొక్క సదవకాశాన్ని వినియోగించుకుని మీ యొక్క విలువైన సమయాన్ని ఆదా చేసుకుని సంస్థ పురోభివృద్ధికి చేయూతను అందించగలర నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ యస్ కె అబ్దుల్ సలామ్ తెలిపారు.

## షరా మామూలుగానే అజెండా ఆల్ పాస్



చీరాల(ఒంగోలు) :సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: చీరాల మున్సిపల్ కౌన్సిల్ అజెండాలోని రెండు అంశాలను రద్దు చేసి, మిగిలిన నలభై అయిదు అంశాలకు ఆల్ పాస్ చెప్పింది. గురువారం చీరాల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అయితే పెద్దగా చర్చ ఏమీ లేకుండానే,అన్ని అంశాలను ఆమోదించింది. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ వర్గీయులైన కౌన్సిలర్లు సల్లూరి సత్యానందం, పాపిశెట్టి సురేష్ నాయుడు అనేక అంశాలను లేవనెత్తి అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ మిగిలిన మొత్తాన్ని కన్నా అధికమొత్తాలకు వార్డుల్లో అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నారని, వీరికి డబ్బులు ఎక్కడ నుంచి తెస్తారని, మున్సిపల్ సాధారణ నిధుల్లో మిగులు నిధులకు మించి వార్డుల్లో అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నారని, వీటికి డబ్బులు ఎలా సర్దుబాటు చేస్తారని సురేష్ నాయుడు నిలదీశారు. ఇది కేవలం ప్రజలను అభివృద్ధి జరుగుతున్నట్లు భ్రమింపజేయడమే అని ఆయన పేర్కొన్నారు. అయితే కమీషనర్ కూడా దీనికి సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. కాగా చీరాల పట్టణంలో కరోనాతోపాటు, డెంగ్యూ కూడా వీర విహారం చేస్తున్న సమయంలో కూడా, మున్సిపల్ కౌన్సిల్ ఈ అంశాన్ని చర్చించకపోవడాన్ని, మరో కౌన్సిలర్ సత్యానందం తప్పుబట్టారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని, దాన్ని విస్మరించడం తగదన్నారు. అయితే మున్సిపల్ చైర్మన్, అధికారులు పెద్దగా వీటిని పట్టించుకున్నట్లు కనిపించలేదు. త్వరత్వరగా కౌన్సిల్ సమావేశాన్ని ముగించి అందరూ నిష్క్రమించారు.

# అతి విశ్వాసం వద్దు..

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని సూచించారు. బద్వేల్‌లో గతంలో వచ్చిన మెజార్టీ కన్నా ఎక్కువ రావాలి. ప్రతి ఇంటికి వెళ్లాలి. ప్రతి ఒక్క ఓటర్‌నూ పలకరించాలి. పార్టీ నేతలకు సీఎం జగన్ ఆదేశాలు ఇచ్చారు. స్వయాన వైద్యురాలు అయిన సుధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. ఎక్కడా అతి విశ్వాసం వద్దని.. కష్టపడి పనిచేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సూచించారు జగన్. బద్వేల్ నియోజకవర్గ బాధ్యతలను మంత్రులు అదిమూలపు సురేష్, అంజాద్ బాషా, ఎంపీలు అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డికి కూడా బాధ్యతలు అప్పగించారు%ొా%సోమవారం నుంచి పార్టీ తరపున కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.. ప్రతి సామాజిక వర్గాన్ని కలుపుకొని పోవాలని సూచించారు.. ఒక్కో ఇంటికి కనీసం 3 నుంచి 4 సార్లు వెళ్లాలని చెప్పారు. 2019లో 77 శాతం ఓటింగ్ జరిగిందని.. ఈసారి ఓటింగ్ శాతం మరింత పెరగాలన్నారు.. పోలింగ్‌లో పాల్గొనేలా ఓటర్లలో చైతన్యం కల్పించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు జగన్.ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా ఓటింగ్ పెంచాలన్నారు. నెలరోజులపాటు నాయకులు తమ సమయాన్ని కేటాయించి ఎన్నికపై దృష్టిపెట్టాలని కోరారు సీఎం జగన్. బద్వేల్ ఉప ఎన్నికకు పార్టీ ఇంఛార్జిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహరిస్తారన్న సీఎం.. వచ్చే సోమవారం నుంచి పార్టీ తరపున కార్యక్రమాలు మొదలుపెట్టాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎలాంటి మేలు జరిగిందో వాడ వాడలా వివరించాలని మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ అభ్యర్థి సుధ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రధాన అజెండగా ప్రచారం నిర్వహిస్తామన్నారు.

# పోటీయా.. సేఫ్ ఎగ్జిటా..?

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాలను పట్టించుకోని టీడీపీ, బీజేపీలు ఇప్పుడు బద్వేలు ఉపపోరులో పట్టించుకుంటాయా? అసలే ఏపీలో వైసీపీ, టీడీపీ మధ్య రాజకీయం ఉప్పు నిప్పులా ఉంది. ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిందని టీడీపీ, బీజేపీ ప్రచారం చేస్తున్నాయి. మొన్నా మధ్య అయితే టీడీపీ నేతలు అసెంబ్లీ రద్దు– మధ్యంతర ఎన్నికలకు డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నిక బరి నుంచి విపక్షాలు అంత తేలిగ్గా తప్పుకొంటాయా?. అయితే ఎంత పోరాడినా విపక్షాలకు గెలుపు సాధ్యమా అనే సందేహాలు ఉన్నాయి. వైసీపీ ఇచ్చిన ఆఫర్‌ను పట్టుకుని గౌరవంగా బరి నుంచి తప్పుకుంటాయా లేక సై అంటాయో చూడాలి. బద్వేల్‌లో గతంలో మూడు దఫాలు టీడీపీ నెగ్గిన సందర్భాలు ఉన్నాయి.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ బాగా దెబ్బతింది. పంచాయతీ, మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో వైసీపీదే హవా. ఇప్పుడు కాదూ కూడదని బద్వేలులో టీడీపీకి పోటీకి సిద్ధపడితే.. వైసీపీ ఉపఎన్నికపై మరింత ఫోకస్ పెడుతుంది. 2019లో ఇక్కడ టీడీపీకి వచ్చిన 50 వేల ఓట్లకు గండికొట్టే ప్రయత్నం చేయొచ్చు. ఉపపోరులో గౌరవప్రదమైన ఓట్లు రాకపోతే టీడీపీ శ్రేణులు ఇంకా డీలా పడే అవకాశం ఉంది. అది టీడీపీకే నష్టం. అందుకే అలాంటి ప్రయోగాలకు పోకుండా.. కేడర్‌లో ధైర్యం సన్నగిల్లకుండా.. అధికారపార్టీ ఇచ్చిన ఆఫర్‌తో సేఫ్ ఎగ్జిట్‌కు తెలుగుదేశం మొగ్గు చూపుతుందో లేదో చూడాలి. అలాగే తిరుపతిలో చావుదెబ్బతిన్న బీజేపీ– జనసేన కూటమి.. కాంగ్రెస్ పార్టీలు ఏం చేస్తాయో చూడాలి.

# బద్వేలు బైపోల్స్‌లో... జనసేనతో బీజేపీ పొత్తు..

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, సోము వీర్రాజు, మధుకర్‌లు పాల్గొన్నారు. ఉప ఎన్నికల్లో పొత్తులు, గట్టి పోటీ ఇచ్చేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన సోము వీర్రాజు.. తాము కచ్చితంగా బద్వేలు ఉప ఎన్నికల బరిలో నిలుస్తామని తేల్చిచెప్పారు. అయితే ఏ పార్టీ నుండి అభ్యర్థి బరిలో నిలుస్తారన్న విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.బద్వేలు ఎమ్మెల్యే దాసరి వెంకటసుబ్బయ్య మరణంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన వెంకటసుబ్బయ్య ఈ ఏడాది మార్చి 28న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ ఉపఎన్నికల్లో ఆయన సతీమణి డాక్టర్ దాసరి సుధను వైఎస్సార్‌సీపీ తమ అభ్యర్థిగా వైసీపీ బరిలో నిలపనుంది. 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేసి ఓడిపోయిన ఓబుళాపురం రాజశేఖర్‌ను తమ అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. బద్వేలు(ఎస్సీ రిజర్వుడ్) ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది. అక్టోబర్ 30న పోలింగ్ నిర్వహించి.. నవంబరు 2న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నియోజకవర్గంలో 2,04,618 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,02,811 మంది పురుషులు, 1,01,786 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

## పీసీసీ చీఫ్ రాజీనామాపై సిద్ధూ పునరాలోచన!

(మొదటి పేజీ తరువాయి)

అయితే, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులను కూడా పదవుల నుంచి తొలగిస్తారా? లేదా? అన్న విషయంపై ఇంకా క్లారిటీ రాలేదు. మరోవైపు కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేసిన పంజాబ్ మాజీ సీఎం అమరీందర్‌సింగ్ ఢిల్లీ పర్యటన ముగిసింది. కాంగ్రెస్‌లో ఉండేది లేదని , బీజేపీలో చేరడం లేదని కీలక ప్రకటన చేశారు కెప్టెన్. త్వరలో జాతీయత చాటే కొత్త పార్టీ పెట్టే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా , జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ఢిల్లీలో భేటీ అయ్యారు అమరీందర్. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నాయి.

# నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదగా హౌసింగ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

నరసరావుపేట,సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట పట్టణంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న జగనన్న కాలనీల ఏర్పాటు సందర్భంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు నరసరావుపేట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం మున్సిపల్ ఆఫీసు నందు చెక్కులు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,చైతన్య గోదావరి బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. లిఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలోనేలి లిమొట్టమొదటిసారిగా జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించేందుకు లబ్ధిదారులకు రుణ సహాయం అందించినందుకు బ్యాంకు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈరోజు 25 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి మూడు లక్షల పదిహేను వేలు రూ రుణ సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు ఈరోజు ఉప్పలపాడు రోడ్డు లోని వంద ఎకరాల్లో నిర్మిస్తున్న ఇళ్ళకి వసతులు రోడ్లు కాలవలు డ్రైనేజీ కరెంట్ ఫెసిలిటీ అన్ని పనులు త్వరగా పూర్తి చేస్తున్నామన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య



గోదావరి బ్యాంక్ సీనియర్ మేనేజర్ జి మహేశ్వర్ రెడ్డి , గ్రీనరీ అండ్ బ్యూటిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చింతా కిరణ్ కుమార్ ,డిఈ శ్రీనివాసరావు , బ్యాంకు అధికారులు, మున్సిపల్ అధికారులు,మరియు రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదగా మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు

## రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా సరితా నాగరాజు




గుంటూరు. సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో విస్తృతంగా 2014 నుండి అవగాహనా కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించే రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ స్వచ్ఛంద సంస్థ చిత్తూరు జిల్లాలో పోస్టల్ కాలని తిరుపతి వద్దతమ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేశాము అని ఈ కార్యాలయంలో అధ్యక్షులు డి. నాగరాజు (సరితా నాగరాజు) ఉపాధ్యక్షుడు గా కె. ఆంజనేయ కుమార్ కార్యదర్శిగా కె. జనార్ధన్ లను నియమించడం జరిగింది అని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. కె. దుర్గ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా అధ్యక్షులు సరితా నాగరాజు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ చిత్తూరు జిల్లా ప్రాంతీయ అధ్యక్షుని గా నన్ను నియమించినదుకు పద్మజ కి ధన్యవాదాలు అని ఈ యొక్క టీమ్ చిత్తూరు జిల్లాలో రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ పై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించుతాము అని రాబోయే రోజుల్లో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం గా పనిచేస్తాము అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటి కి నియామక పత్రాలు, మీటింగ్ మినిట్స్ పుస్తకాలు, రసీదు పుస్తకాలు అందినాయా అని తెలిపారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో రహదారి భద్రతా పోస్టర్లను ఆవిష్కరించారు. సభ్యులు అధ్యక్షులు సరితా నాగరాజు ని శాలువతో సత్కరించారు.

## అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ సెప్టెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి: పట్ట ణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో శా సనసభ్యుడు మొండితోక జగన్ మోహన్ రావు స్థాని క పార్టీ నాయకులతో కలిసి గురువారం మొక్కలు నా టారు ,ముందుగా అయ్యప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ,అనంతరం ఉప ఆ లయాలలో సాయినాధుడిని ,మహాశివుడిని దర్శిం చుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యా వరణ కాలుష్యాన్ని నియంత్రించడం తోపాటు స్వచ్ఛ మైన ప్రాణవాయువును పొందవచ్చని ,మానవాళి మ నుగడ చెట్లపై ఆధారపడి ఉందని తెలిపారు ,మొక్క లు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఒక బాధ్యతగా తీ సుకోవాలన్నారు ,మొక్కలు పెంచడం వల్ల ఆరోగ్యక రమైన, ఆనందకరమైన జీవితం పొందవచ్చని ,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సం రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగ ర పంచాయతీ కౌన్సిల్ సభ్యులు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లె నిద్రలో సబ్ కలెక్టర్



వత్సవాయి న్యూస్ (ప్రజాపాలన ప్రతినిధి )మండలం లోని మాచినేనిపాలెం గ్రామము నకు పల్లెనిద్ర కార్య క్రమమునకు సబ్ కలెక్టర్ పల్లెనిద్ర కోసం మాచినే ని పాలెం గ్రామమునకు వచ్చారు. ఈ కార్యక్రమంలోభా గంగా గ్రామంలో ఉన్న రోడ్లను పరిశీలించారు, రోడ్లుకి సైడ్ కాలువలు కట్టించమని చెప్పారు, రైతు భరోసా కేంద్రం, సచివాలయం ను సందర్శించినారు, సిబ్బంది కి తగు సూచనలు ఇచ్చినారు. ఉదయం కంభంపా డు, చిట్టెల ఇండ్ల ప్లాట్స్ పరిలిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో యం .ఉదయ భాస్కరరావు, తహశీల్దార్ , శ్రీ ప్రసాద్, యం పి డి ఓ, నాగరాజు, యం ఈ ఓ, ఎ ఇ హౌసింగ్, అగ్రికల్చర్ ఎ ఓ, గ్రామ రెవిన్యూ అధకారు లు మరియు ఇతర అధకారులు, గ్రామ సర్పంచ్, గ్రా మస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు కోసం తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఎడ్ల బండ్లతో రైతులు మద్దతు



అవనిగడ్డ, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన రైతు కోసం తెలుగుదేశం పార్టీ అనే కార్యక్రమంలో రైతులు, తెలుగు దేశం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ రైతు సమస్యల పట్ల కనీస పరిజ్ఞానం లేని జగన్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కనీసం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఒకవైపు లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలిసి పోతుండగా మరోవైపు అవనిగడ్డ, బందరు నియోజకవర్గల్లో కాలవ చివరి భూములకు నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని ఇలాంటి దౌర్భాగ్య స్థితికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతులకు సున్నా వడ్డీకి ఇస్తున్న రుణాలకు రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా జమ చేయకపోవడంతో రైతులు పై వడ్డీ భారం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాలనపై, వ్యవసాయశాఖ పై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి దొరకటం ప్రజలు చేసుకున్న దురదృష్టమని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు మండలి వెంకట్రామ్, గొర్రెపాటి రామకృష్ణ, తలశిల స్వర్ణలత, పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరి వెంకటేశ్వరరావుతో పాటు నియోజకవర్గంలోని ఘంటసాల మండల పార్టీ అధ్యక్షుడు చౌదరి సలపల్లి మండల పార్టీ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు మండల ప్రజా పరిషత్ కాల్ రాంబాబు సి డి సి చైర్మన్ నాగేశ్వరావు అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి బాబు ఉ కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు నాగాయలంక అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు అంగడి నియోజవర్గ రైతు కమిటీ అధ్యక్షుడు బావి శెట్టి వెంకటేశ్వరరావు రాష్ట్ర తెలుగు రైతు కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెపాటి రామకృష్ణ రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి పుల్లగూడ రాజేంద్ర రావు మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షు రాలు చల్లపల్లి స్వర్ణలత ఎంపీపీ విజయ రాధిక మహిళ ఎస్ లక్ష్మి మాజీ ఎంపీలు బండి నా గ కనకదుర్గ మార్ల జయ లక్ష్మి నియోజకవర్గంలోని గ్రామ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు అనుబంధ సంస్థ నాయకులు విరివిగా పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలి



ఏలూరు సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు స్థానిక పత్తేబాద్ నాలుగు గుళ్ళు సెంటర్ లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో జరగబోయే 51 వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని దేవస్థానం కమిటీ సభ్యులు అధికారులు గురువారం %జుఖణా% చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరామ్ గారు ని ఆహ్వాన పత్రికను అందించారు. ముందుగా దేవస్థానం అర్చకులు ఈశ్వరి బలరామ్ గారికి ఆశీర్వచనాలు అందించి ఘనంగా సత్కరించారు స్థానిక కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్ గారు దేవస్థానం కమిటీ చైర్మన్ ఏం మల్లికార్జునరావు గారు కార్యనిర్వాహణాధికారి డి శంకర్రావు ఎమ్ ఆర్ డి బలరాం ఈశ్వరి వారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.....

## పరిపాలనాధికారి మార్తమ్మ సేవలు అభినందనీయం - జడ్పీటిసి తుమ్మల మురళీకృష్ణ

**ఘంటశాల, ప్రజాపాలన :** మండల పరిషత్ పరిపాలనాధికారి పొలిమెట్ల మార్తమ్మ సేవలు



అభినందనీయమనీ జడ్పీటిసి తుమ్మల మురళీకృష్ణ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఘంటశాల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యం.పి.డి.ఓ. కె.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో వై.సి.పి. మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావ్ ఆధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. జడ్పీటిసీ తుమ్మల మురళీకృష్ణ మాట్లాడుతూ గత 31 సం॥ లుగా మండల పరిషత్ కార్యాలయాల్లో చిన్న టైపిస్టి గా ఉద్యోగం ప్రారంభించి నందివాడ, మండవల్లి, కలదిండి,నాగాయలంక, గుడివాడ తదిరత మండలాల్లో పనిచేసి దినదినాభివృద్ధి చెందుతూ వచ్చి ఎందరో అధికారులు మన్ననలు పొంది నేడు మండల పరిషత్ పరిపాలనాధికారిగా పదవీ విరమణ మా ఘంటశాల మండలంలో చేయటం ఎంతో అభినందనీయమనీ జడ్పీటిసి తుమ్మల మురళీకృష్ణ పేర్కొన్నారు. అనంతరం యం.పి.డి.ఓ. కె.వి.సుబ్బారావు మాట్లాడుతూ పరిపాలనాధికారి ఓ పని రాక్షసి అని తనకు అప్పగించిన పనిని సమయపాలన చూడకుండా అయ్యేవరకు నిద్రపోని పనిరాక్షసి అని ఆమె పలువురు అదికారులకు దిక్సూచి అని యం.పి.డి.ఓ. కొనియాడారు. మందుగా పరిపాలనాధికారి మార్తమ్మకు పూలదండ వేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ అభినందన సభలో వై.సి.పి. యువనాయకులు వేమూరి ప్రవీణ్, యం.పి.టి.సి. సభ్యురాలు వెంకటలక్ష్మీ, నాయకులు పిచ్చేశ్వరరావు, ఏ.ఓ. మురళీకృష్ణ , సీనియర్ అసిస్టెంట్ సురేష్‌బాబు, పంచాయితీ కార్యదర్శులు జయలక్ష్మీ, రమాదేవి, అర్జునరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పోతన వెంకటేశ్వరరావు, విశ్రాంత గృహనిర్మాణ శాఖ ఏ.ఈ ఏ.బి.శంకర్రావు, పంచాయితీరాజ్ ఏ.ఈ. జె. నాగేశ్వరరావు, సచివాయల సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, కుటుంభసభ్యులు తదితరులు పాల్గొని అభినందించారు.

## ఆర్ ఐ సుబ్బారావు పై దాడికి పాల్పడిన నిందితులను పోలీసులు తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలి: నవతరం పార్టీ నేత డా.గోదా రమేష్ కుమార్ డిమాండ్



నరసరావుపేట, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: రొంపిచర్ల మండల ఆర్ ఐ గా విధులు నిర్వహిస్తూ ఎల్లప్పుడూ ఉన్నతాధికారులకు మరియు సహచర సిబ్బందిపట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మన్నలను పొందుతున్న రొంపిచర్ల ఆర్ ఐ సుబ్బారావు మరియు జూనియర్ అసిస్టెంట్ ఇరువురూ రాత్రి ఆఫీస్ లో తమ విధులను ముగించుకొని ఇంటికెళ్తున్న క్రమంలో అన్నవరం వద్ద గుర్తుతెలియని దుండగులు ఇరువురిపై తీవ్రంగా దాడిచేయడం బాధాకరమని తక్షణమే పోలీసులు ఘటనలోని నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని నవతరం పార్టీ నరసరావుపేట పార్లమెంట్ ఇన్ ఛార్జ్ డా.గోదా రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని ప్రైవేట్ హాస్పటల్ లో చికిత్స పొందుతున్న ఆర్ ఐ సుబ్బారావును రమేష్ కుమార్ పరామర్శించి జరిగిన ఘటన గురించి బాధితుణ్ణి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రొంపిచర్లలోని నల్లగార్లపాడులో గల అంబేద్కర్ కాలనీలో జరిగిన సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ అధికారులపై ఇటువంటి దాడులకు పాల్పడే వారిపై అధికారులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## పడవపైన నది దాటి స్కూలుకు వెళుతున్న ఎడ్లంక విద్యార్థులు



అవనిగడ్డ:సెప్టెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి– పాత ఎడ్లంక గ్రామ ప్రజల ప్రయాణ దుస్థితి యధావిధిగా కొనసాగుతోంది. ప్రభుత్వాలు మారిన రాజకీయ ప్రతినిధులు మారినా ప్రజాసమస్యలు తీరడం లేదు. అలాంటి సమస్యల్లో ఒకటి అవనిగడ్డ మండలం పాత ఎడ్లంక గ్రామం కృష్ణా నది పాయలో ప్రమాదకర ప్రయాణం. తరచూ వచ్చే వరదల కారణంగా నదిలో వేసిన రహదారి మార్గం కాజ్వే కొట్టుకు పోయి నదిలో పడవ దాటుతూ గ్రామస్తులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఉపయోగం లేకపోవడంతో గ్రామస్తులకు పడవ ప్రయాణం తప్పడం లేదు. ఈ క్రమంలో గత 3 రోజులుగా గ్రామస్తులు స్కూల్ విద్యార్థులు ఇతర అవసరాల నిమిత్తం వచ్చేవారు పడవ దాటి ప్రయాణం చేస్తున్నారు. ఏడాదికి నాలుగు నెలలు తాము పడుతున్న ఈ దుస్థితి నుండి విముక్తి కలిగించాలని శాశ్వత పరిష్కారానికి రాజకీయ నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చి బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఎడ్లంక గ్రామస్తులు కోరుతున్నారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA CLUB / SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 01,అక్టోబరు 2021


## నింపని ఖాళీలు...తేలని కేసులు...

దేశ వ్యాపితంగా న్యాయమూర్తుల ఖాళీలను నింపటం, కోర్టులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించటం, కోర్టుల్ని ఆధునీకరించటం, సమర్థులైన వ్యక్తులు న్యాయమూర్తులుగా వెళ్లేందుకు ఇష్టపడేలా ఆ వ్యవస్థని రూపుదిద్దటం అవసరం. పని గంటలు పెంచటం కాకుండా ఉన్న సమయంలో సరిగ్గా పని చేసేట్లు ఉన్నత న్యాయస్థానాలు పర్యవేక్షించటం,అనవసరమైన సెలవుల్ని తగ్గించటం, మధ్యవర్తిత్వంలో న్యాయమూర్తుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండటం లాంటి చర్యలకు పూనుకోవటం ద్వారా ఈ పెండెన్సీని గణనీయంగా తగ్గించవచ్చు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏనాడూ న్యాయమూర్తుల ఖాళీలన్నీ నింపిన పాపాన పోలేదు. ప్రస్తుతం దేశ వ్యాపితంగా 5984 మంది న్యాయమూర్తుల ఖాళీలు ఉన్నాయి. ఇందులో అధిక భాగం అంటే 78 శాతం బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ లాంటి పది రాష్ట్రాలలోనే ఉన్నాయి. మొత్తం ఉండాల్సిన 22,677 మంది న్యాయమూర్తుల్లో ఈ సంఖ్య నాలుగో వంతు పైనే అవుతుంది. మొత్తం దేశంలో పెండింగ్‌లో ఉన్న 4 కోట్ల కేసుల్లో 2.72 కోట్ల కేసులు దిగువ కోర్టుల్లోనే కాగా మిగిలినవి దేశం లోని 25 హైకోర్టుల్లోనూ, సుప్రీం కోర్టులోనూ ఉన్నాయి. ఈ పెండింగ్ కేసులు 10 సంవత్సరాలపై నుండి ఉన్నవి 22,57,000 కాగా అందులో కొన్ని రెండు మూడు దశాబ్దాలుగా ఉన్నాయి. అనేక సంవత్సరాల తర్వాత ప్రస్తుతం సుప్రీం కోర్టుకు పూర్తి స్థాయి (ఒకటి తక్కువ)లో న్యాయమూర్తులున్నారు. పార్లమెంటరీ కమిటి సిఫారసు ప్రకారం ప్రతి పది లక్షల జనాభాకు 50 మంది న్యాయమూర్తులు వుండాలి. అయితే దేశంలో 13 మంది మాత్రమే ఉన్నారు. ఈ 13 మందిలోనే పైన చెప్పిన ఖాళీలు ఉన్నాయి. దేశం లోని హైకోర్టుల్లో 1098 న్యాయమూర్తులుండాల్సి ఉండగా అందులో 465 ఖాళీలున్నాయి. 37 మంది ఉండాల్సిన ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది మాత్రమే ఉన్నారు. 42 మంది న్యాయమూర్తులుండాల్సిన తెలంగాణ హైకోర్టులో 21 మంది, 160 మంది న్యాయమూర్తులు ఉండాల్సిన అలహాబాద్ హైకోర్టులో 68 మంది, 94 మంది ఉండాల్సిన బొంబాయి హైకోర్టులో 33 పోస్టులు, 60 మంది ఉండాల్సిన ఢిల్లీ హైకోర్టులో 31 పోస్టులు, 55 మంది ఉండాల్సిన పంజాబ్ హర్యానా హైకోర్టులో 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేశవ్యాపితంగా ఉన్న అన్ని హైకోర్టుల్లోనూ ఇదే పరిస్థితి. మరోవైపు పెండెన్సీ తగ్గటానికి మధ్యవర్తిత్వం పరమౌషధంగా చాలా మంది న్యాయమూర్తులు ఇటీవల ప్రవచించటమే గాక లోక్ అదాలత్‌లలో ఇబ్బడిముబ్బడిగా కేసులు పరిష్కరిస్తున్నారు. అయితే ఇక్కడ కక్షిదారులకు ముఖ్యంగా నష్టపరిహారం కోసం ఎదురు చూసే న్యాయార్థులకు తీరని అన్యాయం జరుగుతుంది. సంవత్సరాల తరబడి జరుగుతున్న జాప్యం కారణంగా ఇన్సూరెన్స్ కంపెనీలు ఇష్టానుసారంగా విదిల్చే తక్కువ పరిహారానికి అంగీకరించాల్సిన నిస్సహాయ పరిస్థితి వారికి కలుగుతుంది. క్రిమినల్ కేసుల్లో మధ్యవర్తిత్వ పరిష్కారం కారణంగా చాలా కేసులు పరిష్కరించాలని చెప్పుకోవటానికి కోర్టులు పోలీసులపైన ఒత్తిడి చేస్తుంటే, పోలీసులు బాధితులపై ఒత్తిడి చేసి 'మమ' అనిపిస్తున్నారు. దేశంలో ఎక్కువ చోట్ల ఈ పరిష్కారాల్లో న్యాయమూర్తుల పర్యవేక్షణ ఉండటం లేదు. న్యాయాన్యాయ విచక్షణ లేకుండా ఇరువురూ కోర్టు బయట చేసుకొనే రాజీలను రికార్డ్ చేసే పనికి న్యాయమూర్తులు పరిమితమవుతున్నారు. అసలే 4 కోట్ల పైచిలుకు కేసుల జాప్యంతో కునారిల్లుతున్న మన న్యాయపాలిక కోవిడ్ కారణంగా మరో 25 శాతం కేసులు పెరగటంతో సతమతమవుతుంది. “స్వతంత్ర న్యాయ వ్యవస్థ” అని గప్పాలు కొట్టుకొనే మనం అది నిజమని గుండెలపై చేయి వేసుకొని చెప్పలేం. కింది కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం విషయంలో కేంద్ర ప్రభుత్వం పాత్ర ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం తోనూ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తోనూ చర్చించి హైకోర్టులే చేయవచ్చు. కాని మౌలిక వసతులు కల్పించాల్సిన ప్రభుత్వాలు ఉన్న కోర్టులకు, న్యాయ మూర్తులకే సరైన వసతులు కల్పించటం లేదు. ఖాళీలు నింపే విషయమై సుప్రీంకోర్టు దేశంలోని అన్ని హైకోర్టుల్ని ఆదేశించినా ప్రభుత్వాల అలసత్వం కారణంగా ఇది ముందుకు కదలటం లేదు. కొన్ని కోర్టులు సంఖ్య చెప్పుకోవటానికి ఉన్నా... న్యాయమూర్తుల కొరత కారణంగా ఇన్‌ఛార్జి జడ్జీలు ఈ కోర్టుల పని పూర్తిగా చేయలేకపోతున్నారు. పైగా పని భారంతో తమ స్వంత కోర్టు పని కూడా చేయలేకపోతున్నారు. పెండెన్సీకి మరో కారణం ఇబ్బడిముబ్బడిగా ఉన్న సెలవలు. అమెరికా లాంటి దేశాల్లో కోర్టులకు వేసవి సెలవులే ఉండవు. కాని మన దేశంలో అన్ని కోర్టులకూ నెల రోజుల పైనే సెలవులుంటాయి. సంక్రాంతికి, దసరాకి పది రోజుల చొప్పున, శని, ఆదివారాలు కారణంగా సంవత్సరానికి 100 రోజులు, న్యాయమూర్తులకు 20 పబ్లిక్ సెలవులు, 11 ఆప్షనల్ సెలవులు ఉంటాయి. వేర్వేరు కారణాలతో న్యాయమూర్తులు, ప్రాసిక్యూటర్లు సెలవులు పెట్టటం, న్యాయవాదులు కోర్టులు బహిష్కరించటం, కొన్ని చోట్ల న్యాయవాదులు చనిపోతే ఆ రోజు మొత్తం విధులకు హాజరు కాకపోవటం, మొత్తంపైన సగానికి పైగా పనిదినాలు వృథా అవుతుండగా, పర్యవేక్షణ కొరవడిన న్యాయమూర్తుల పని విధానం కూడా ఈ పెండెన్సీ పెరుగుదలకు కారణమే. గడచిన రెండున్నరేళ్ళుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసిన కేసుల్ని విచారించటానికే హైకోర్టుకు సమయం సరిపోయింది. ఇక పెండెన్సీ పెరగక ఏం చేస్తుంది? ఇప్పటికీ వేల సంఖ్యలోనే ప్రభుత్వంపైన వేసిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో షుమారు 8 వేలు కోర్టు ధిక్కరణ కేసులే ఉండటం గమనార్హం. కేసుల్లో జరుగుతున్న జాప్యానికి శాశ్వత పరిష్కారం చూడాలి. షార్ట్‌కట్ ఉపాయాలు సమస్యని పరిష్కరించకపోగా మరింత జటిలం చేస్తాయి. దేశ వ్యాపితంగా న్యాయమూర్తుల ఖాళీలను నింపటం, కోర్టులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించటం, కోర్టుల్ని ఆధునీకరించటం, సమర్థులైన వ్యక్తులు న్యాయమూర్తులుగా వెళ్ళటానికి ఇష్టపడేలా ఆ వ్యవస్థని రూపుదిద్దటం అవసరం. పని గంటలు పెంచటం కాకుండా ఉన్న సమయంలో సరిగ్గా పని చేసేట్లు ఉన్నత న్యాయస్థానాలు పర్యవేక్షించటం, అనవసరమైన సెలవల్ని తగ్గించటం, మధ్యవర్తిత్వంలో న్యాయమూర్తుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండటం లాంటి చర్యలకు పూను కోవటం ద్వారా ఈ పెండెన్సీని గణనీయంగా తగ్గించవచ్చు.

# జమ్మూకాశ్మీర్‌లో దిగజారుతున్న పరిస్థితులు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదాను రద్దు చేసిన తర్వాత 1990వ దశాబ్దంలో వలె యువకులు ఎక్కువగా తీవ్రవాదం వైపు ఆకర్షితులౌతున్నారు. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పటి వలె ఇపుడు పాకిస్తాన్ ప్రోత్సాహం లేదు. యువత తమకు తాముగానే తీవ్రవాదం వైపు మొగ్గుతున్నారు. వారు పాకిస్తాన్‌కు కూడా వ్యతిరేకంగానే ఉన్నారు. సైన్యం చేతుల్లో ప్రజలు పడుతున్న వేధింపులు యువతను తీవ్రవాదం వైపు నెడుతున్నాయి. ఉద్యోగాలు లేవు. ఉపాధికి మార్గం లేదు. యువతకు రెండే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. అయితే తీవ్రవాదులతో చేరటం లేదా ఆత్మహత్య చేసుకోవటం. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించి 2021, ఆగస్టు 5వ తేదీకి రెండు సంవత్సరాలు పూర్తయింది. కాశ్మీర్ లోయలో తీవ్రవాదం పెరగటానికి ఆర్టికల్ 370 ప్రధాన కారణంగా ఉన్నదని, ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజికాభివృద్ధిని కుంటుపరుస్తున్నదని కూడా ఆనాడు కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తే జమ్మూకాశ్మీర్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం వాదించింది. రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన రెండు సంవత్సరాల తర్వాత కేంద్రం చేసిన వాదనలు ఆచరణలో ఏ విధంగా ఉన్నాయనేది పరిశీలించటం అవసరం. తీవ్రవాదాన్ని అంతం చేయటం, రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధిని సాధించటం ప్రధాన లక్ష్యాలుగా 370 ఆర్టికల్‌ను రద్దు చేసేటపుడు ప్రభుత్వం ప్రకటించింది. 2019తో పోల్చుకున్నపుడు 2020, 21లో తీవ్రవాద కార్యకలాపాలు తగ్గాయని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఈ కాలంలో తీవ్రవాద సంబంధిత కార్యకలాపాలలో 59 మంది మరణించారని, కాని పౌరులెవరూ మరణించలేదని పేర్కొంది. రాళ్ళు విసిరిన వారికి, భారతదేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నవారికి భారతదేశ పాస్‌పోర్టులు ఇవ్వకూడదని, ప్రభుత్వ ఉద్యోగాలు చేయకుండా నిషేధించాలని జమ్మూకాశ్మీర్ పాలనా యంత్రాంగం నిర్ణయించింది. కోపంతో రాళ్లు విసిరిన వారిని కూడా దేశ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నవారితో సమంగా శిక్షించాలని నిర్ణయించటం ప్రభుత్వ మూర?పు వైఖరిని తెలియజేస్తున్నది. తీవ్రవాద సంఘటనలు తగ్గినంత మాత్రాన రాష్ట్రంలో తీవ్రవాదాన్ని పెంపొందించే వాతావరణం తగ్గలేదు. 2021 ఆగస్టు 24వ తేదీన సమావేశమైన పీపుల్స్ అలయెన్స్ ఫర్ గుప్కార్ డిక్లరేషన్ నాయకులు రాష్ట్రంలో నెలకొన్న శ్మశాన నిశ్శబ్దాన్ని సాధారణ పరిస్థితులు నెలకొనటంగా భ్రమపడవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కాశ్మీరీయులను అవమానించటం ద్వారా తన ఘనతను చాటుకోవటానికి ప్రయత్నం చేస్తున్నదని, తాము కూడా గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని భావిస్తున్నామని, కాశ్మీర్ ప్రజలను అవమానించటాన్ని విరమించుకోకపోతే ప్రమాదకరమైన పర్యవసానాలు ఎదురౌతాయని వారు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదాను రద్దు చేసిన తర్వాత 1990వ దశాబ్దంలో వలె యువకులు ఎక్కువగా తీవ్రవాదం వైపు ఆకర్షితులౌతున్నారు. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పటి వలె ఇపుడు పాకిస్తాన్ ప్రోత్సాహం లేదు. యువత తమకు తాముగానే తీవ్రవాదం వైపు మొగ్గుతున్నారు. వారు పాకిస్తాన్‌కు కూడా వ్యతిరేకంగానే ఉన్నారు. సైన్యం చేతుల్లో ప్రజలు పడుతున్న వేధింపులు యువతను తీవ్రవాదం వైపు నెడుతున్నాయి. ఉద్యోగాలు లేవు. ఉపాధికి మార్గం లేదు. యువతకు రెండే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. అయితే తీవ్రవాదులతో చేరటం లేదా ఆత్మహత్య చేసుకోవటం. యువకులు, సామాన్య ప్రజలు ఎటువంటి అసంతృప్తిని వ్యక్తం చేసినా అధికారులు వారిపై ఐపిసి లోని తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారు. సజ్జాద్ రషీద్ సోఫి అనే యువకునిపై ఐపిసి 153 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ప్రజలు బయటి నుండి వచ్చిన వారి కన్నా స్థానిక అధికారుల నుండి ఎక్కువ ఆశిస్తున్నారని అతడు జూన్ 10వ తేదీన గవర్నర్ సలహాదారుతో చెప్పారు. ప్రజల మధ్య శతృత్వాన్ని పెంపొందిస్తున్నాడనే ఆరోపణలతో ఆరోజే అతనిపై కేసు బనాయించారు. ఈ విధంగా వాస్తవాలను వెల్లడిస్తున్న వారిపైనా, తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న వారిపైనా దేశ వ్యతిరేకులని, తీవ్రవాదులని, పాక్ అనుకూలురని ముద్ర వేస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)ను తరచుగా మైనారిటీ తీరని వారిపై కూడా ప్రయోగించటంతో యువకులలో ఆగ్రహం పెల్లుబుకుతున్నది. యువకులు ఎక్కువ సంఖ్యలో ఆయుధాలు లేకుండా తీవ్రవాదులకు సాయపడేవారిగా పని చేస్తున్నారు. అవసరమైనన్ని ఆయుధాలు, మందుగుండు లభ్యమైతే వారంతా తీవ్రవాదులుగా రూపుదాల్చే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయి. ప్రత్యేక హోదా రద్దుతో ఒక దేశం, ఒక రాజ్యాంగం, ఒక జెండా, ఒక మార్కెట్ సాకారమైందని కేంద్రం ప్రకటించింది. రాజ్యాంగంలో జమ్మూకాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నట్లు ప్రచారం చేస్తూ కేంద్రం దేశ ప్రజలను తప్పుదారి పట్టించటానికి ప్రయత్నం చేసింది. రాజ్యాంగంలోని 371 ఆర్టికల్ లోని వివిధ సెక్షన్‌లు ఈశాన్యరాష్ట్రాలు, హిమాచల్ ప్రదేశ్, గోవా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్నాయి. వీటిని కప్పిపెట్టి, జమ్మూకాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేక ప్రతిపత్తి ఉన్నట్లు, తద్వారా అక్కడ వేర్పాటువాదం పెరుగుతున్నట్లు చేసిన ప్రచారం దేశప్రజలలో జమ్మూకాశ్మీర్ ప్రజలపై వ్యతిరేకత పెరగటానికి దారితీసింది.

**ఆర్థికాభివృద్ధిపై తప్పుడు ప్రచారం**

జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన తర్వాత అక్కడ జరుగుతున్న ఆర్థికాభివృద్ధిని గురించి కేంద్రం గొప్పగా ప్రచారం చేస్తున్నది. కాని వాస్తవంగా జరిగిన అభివృద్ధి లేదు. 2019 ఆగస్టు 5 తర్వాత గడచిన రెండు సంవత్సరాలలో 4 నెలలు నిరసనల వలన, మరో ఏడు నెలలు కోవిడ్ వలన వ్యాపారాలు మూతపడినాయి. ఈ కాలంలో మొత్తం ఆర్థిక వ్యవస్థకు 70 వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కాశ్మీర్ ఎకనామిక్ అలయెన్స్ అంచనా వేసింది. చేతివృత్తులు, టూరిజం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హార్టికల్చర్ తదితర రంగాలలో లక్ష మందికి పైగా ఉద్యోగాలను కోల్పోయారు. జమ్మూకాశ్మీర్ లోని గ్రామీణ ప్రాంతాలు ఇంత తీవ్రమైన దుస్థితిని ఎదుర్కోవటం గత 70 సంవత్సరాలలో ఇదే తొలిసారి. 2019, ఆగస్టు 5కు ముందు ప్రభుత్వానికి అవసరమైన సరుకులన్నింటినీ జమ్మూ కాశ్మీర్ వర్తకుల నుండే కొనుగోలు చేసేవారు. ఆ తర్వాత దేశం లోని మిగతా ప్రాంతాలలోని వర్తకుల నుండి కూడా కొనుగోలు చేయటంతో జమ్మూ కాశ్మీర్‌లోని వర్తకులు వారితో పోటీ పడలేక గతంలో ఉన్న మార్కెట్‌ను కూడా కోల్పోయారు.

రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. 2019 నవంబరులో కురిసిన అకాల మంచు వారి పంటలను నాశనం చేసింది. మిగిలిన పంటను అమ్ముకోవటానికి ప్రయత్నిస్తే మిలిటెంట్ల నుండి బెదిరింపులు ఎదురయ్యాయి. ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసిన తర్వాత సాధారణ జీవితాలు గడుపుతున్న, వ్యాపారాలు సాగిస్తున్న వారిపై మిలిటెంట్లు దాడులకు పూనుకొనే పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితు లలో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నష్ట పరిహారం ప్రకటించకపోవటం రైతాంగంలో అసంతృప్తిని పెంచింది. ఆగస్టు 5 తర్వాత వివిధ కారణాలను చూపుతూ ప్రభుత్వం కొందరు వ్యాపారులను అరెస్టు చేసింది. ఈ అంశంపై వ్యాపారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కాశ్మీర్ లోయలో మొత్తం 200 మంది తీవ్రవాదులున్నారు. అందుకు కాశ్మీరీయులందరినీ శిక్షిస్తారా అని వారు ప్రశ్నిస్తున్నారు.

**కేంద్ర విధానాలే అవినీతికి కారణం**

జమ్మూకాశ్మీర్‌లో అవినీతి పెరగటానికి, అభివృద్ధిలో రాష్ట్రం వెనుకపడటానికి ఆర్టికల్ 370 కారణమని కేంద్ర ప్రభుత్వం ఆరోపణలు చేస్తున్నది. అవినీతి, బంధుప్రీతి, కాశ్మీరీయులు దూరం




కావటానికి కేంద్ర ప్రభుత్వ విధానాలు మినహా ఆర్టికల్ 370 కారణం కాదు. కేంద్రంలో వరుసగా వస్తున్న ప్రభుత్వాలు స్థానికంగా ఉన్న ప్రాంతీయ పార్టీల నాయకులను సంతృప్తి పరచటానికి అనుసరిస్తున్న విధానాలు అవినీతి, బంధుప్రీతి, అసమర్థ పరిపాలనకు కారణమౌతున్నాయి.

**అంతర్జాతీయ సమస్యగా మార్చిన బిజెపి ప్రభుత్వం**

ఆర్టికల్ 370 రద్దుతో మన అంతర్గత సమస్యగా ఉన్న జమ్మూ కాశ్మీర్ అంతర్జాతీయ సమస్యగా మారింది. జమ్మూకాశ్మీర్ సమస్యను భారత్, పాకిస్తాన్‌లు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న విధానానికి గత 50 సంవత్సరాల నుండి మన దేశం కట్టుబడి ఉంది. సమస్య పరిష్కారానికి మూడవ పార్టీ మధ్యవర్తిత్వాన్ని భారతదేశం ఎప్పుడూ అంగీకరించలేదు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత అమెరికా హౌస్ రిజల్యూషన్స్ పాస్ చేసి, భారత ప్రభుత్వ చర్యను ఖండించింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశాలలో భారతదేశ చర్యపై చర్చించారు. కాశ్మీర్ సమస్యపై అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని బ్రిటన్ లోని లేబర్ పార్టి డిమాండ్ చేసింది. సమస్య పరిష్కారం కోసం పాకిస్తాన్‌తో చర్చించాలని యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. దీని నుండి పక్కదారి పట్టించటం కోసం ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీల పేరుతో 2019 అక్టోబరులో ఇ.యు లోని అతి మితవాద పార్టీల ప్రతినిధులను కాశ్మీర్‌కు పిలిపించటం ద్వారా ప్రభుత్వమే ఈ సమస్యపై అంతర్జాతీయ చర్చను తీవ్రం చేసింది. రెండో విడత 15 దేశాల రాయబారులను పిలిచారు. భారత, పాకిస్తాన్‌లు ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవటానికి తమ దేశం మధ్యవర్తిత్వం వహిస్తుందని చివరికి అమెరికాలోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయబారి కూడా చెప్పాడు.

**నియోజక వర్గాల పునర్విభజనపై ఆందోళన**

నియోజకవర్గాల పునర్విభజనపై కూడా కాశ్మీరీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2011 సెన్సస్ ప్రకారం కాశ్మీర్ లోయలో 69 లక్షల మంది ఉండగా, జమ్మూలో 54 లక్షల మంది ఉన్నారు. కాశ్మీర్ భూభాగం 15 వేల చదరపు కిలోమీటర్లు కాగా, జమ్మూ భూభాగం 26 వేల చదరపు కిలోమీటర్లు ఉన్నది. నియోజకవర్గాలను పునర్విభజన చేసేటపుడు ప్రజలతో నిమిత్తం లేకుండా భూభాగం లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని, కాశ్మీర్ లోయకు ప్రతికూలంగా చేస్తారేమోననే ఆందోళన కూడా ప్రజలలో ఉన్నది. ఉమ్మడి జమ్మూకాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీలో కాశ్మీర్ లోయలో 46, జమ్మూలో 37, లడక్‌లో 4, మొత్తం 87 స్థానాలు ఉన్నాయి. విభజన అనంతరం 4 స్థానాలు లడక్ కేంద్రపాలిత ప్రాంతం పరిధిలో ఉంటాయి కాబట్టి జమ్మూకాశ్మీర్‌కు 83 స్థానాలు ఉంటాయి.

శీతాకాలంలో రాజధానిని శ్రీనగర్ నుండి జమ్మూకు మార్చే సాంప్రదాయం 149 సంవత్సరాల నుండి కొనసాగుతున్నది. ఉన్నతాధికారులతో పాటు సాధారణ అధికారులు, సిబ్బంది కూడా జమ్మూ ప్రాంతానికి వచ్చి ఉండేవారు. కాని ఈ సంవత్సరం అందుకు భిన్నంగా కాశ్మీర్ నుండి రావలసిన అధికారులకు ప్రభుత్వం అధికారిక నివాసాలను కేటాయించలేదు. ఇ-గవర్నెన్స్‌ను ఉపయోగించుకొని సిబ్బందిని కదిలించకుండానే ఫైళ్ళను పరిష్కరించుకోవచ్చునని, తద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చునని ప్రభుత్వం చెబుతున్న సాకులు ప్రజలను సంతృప్తి పర్చలేదు. సిబ్బందిని కూడా తరలించి ఉంటే జమ్మూకు రాజధాని వాతావరణం ఏర్పడేది. వృత్తులు, వ్యాపారాలు పుంజుకునేవి. ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ చర్య ప్రజలలో అసంతృప్తిని పెంచింది.

**జమ్మూ లోనూ పెరుగుతున్న అసంతృప్తి**

కాలం గడిచేకొద్దీ ప్రభుత్వ విధానాలపై జమ్మూలో కూడా అసంతృప్తి పెరుగుతున్నది. గతంలో ఆర్టికల్ 370, 35ఎ ని రద్దు చేయాలని డిమాండ్ చేయటంలో ముందున్న బిజెపి స్థానిక శాఖలోని ఎక్కువ మంది కూడా రాష్ట్ర హోదాను పునరుద్ధరించమని ఇపుడు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరిస్తే అభివృద్ధి జరుగుతుందని ప్రచారం చేశారని, కాని రాష్ట్రాన్ని విభజించిన తర్వాత జరిగిన అభివృద్ధి నామమాత్రమేనని వారు పేర్కొంటున్నారు. కాశ్మీర్ లోయలో కన్నా జమ్మూలో రక్షణ పరిస్థితులు మెరుగుగా ఉండటంతో, ఆర్టికల్ 35ఎ రద్దు వలన చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని బయటి వారు ఈ ప్రాంతంలోని భూములను కాజేస్తారనే ఆందోళన స్థానికులలో తీవ్రంగా ఉన్నది. ప్రధాని వాగ్దానం చేసిన విధంగా జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని స్థానిక ప్రజలలో డిమాండ్ పెరుగుతున్నది.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు: ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట సెప్టెంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి:ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా ము ఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నా రని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యు లు సామినేని ఉ దయభానుతెలిపారు. గురువారం ప ట్టణంలోని వారి స్వగృహంలో వివిధ సమస్యల పరి ష్కారం కోరుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలతో మమేకం అయ్యారు.ఈ సం దర్భంగా ప్రతిఒక్కరితో మాట్లాడుతూ వారి సమస్య లను ఆడిగితెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించా రు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైఎస్ఆర్ పింఛ ను కానుక పథకం ద్వారా మంజూరైన పింఛన్లు నవం బర్ 1వ తేదీ నుండి ప్రతినెల లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పింఛన్ల పంపిణీ లో అర్హులకు ఏ చిన్న ఇబ్బందీ కలగకుండా ఉండేందు కు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంద ని, లబ్ధిదారులు సొంత ఊరిలో కాకుండా గత ఆరు నెలలుగా మన రాష్ట్రంలోనే మరో చోట నివాసం ఉం టుంటే తాము ఉన్న చోటనే పింఛన్ పొందేందుకు రా ష్ట్ర ప్రభుత్వం వీలు కల్పించిందని తెలియజేశారు.

## గ్రామాభివృద్ధే మా లక్ష్యం లింగా రెడ్డి పాలెం గ్రామ సర్పంచ్ శ్రీ దుర్గ



కోడూరు, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: కోడూరు మండలం జరుగువానిపాలెం రక్షిత మంచినీటి చెరువు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన గ్రామ సర్పంచ్ శ్రీ దుర్గా. లింగారెడ్డి పాలెం గ్రాపంచాయతీ అభివృద్ధే ధ్యేయంగా ప్రజల సౌకర్యాలు దృష్టిలో ఉంచుకుని తాము పనిచేస్తున్నట్లు సర్పంచ్ శ్రీదుర్గా అన్నారు. గురువారం జరుగువానిపాలెం గ్రామంలోని రక్షిత మంచినీటి చెరువు వద్ద జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలను ఏర్పాటు చేసి చెరువు చుట్టూ ఉన్న ముళ్ల పొదలను తొలగించడం జరుగుతుందని, గత మూడు రోజుల నుండి ముళ్ళకంప పిచ్చి మొక్కలు తొలగించే తదితర కార్యక్రమాలతో పాటు మంచినీటి చెరువులో పేరుకుపోయిన జనుము గడ్డి తీసి వేస్తున్నామని తెలిపారు. త్వరలోనే చెరువు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆమె అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు ఆరోగ్యవంతమైన, సురక్షితమైన మంచినీటిని అందించడానికి కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి పాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



వత్సవాయి సెప్టెంబర్ 30 ప్రజా పాలన ప్రతినిధి:వత్స వాయి మండలంలోని మంగొల్లు గ్రామానికి చెందిన శే లం వెంకటేశ్వర్లు కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వా రా మంజూరైన రూ. 40 వేల రూపాయల చెక్కును గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాస నసభ్యులు సామినేని ఉదయభాను అందజేశారు.

## గాంధీ జయంతి సందర్భంగా కొండవీడు ఇ.ఎన్.టి. హాస్పటల్లో ఉచిత మెగా వైద్య శిబిరం



నరసరావుపేట, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: గాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2తేదీన పట్టణంలోని కొండవీడు ఇ. ఎన్. టి ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం హెటల్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి తగిన సలహాలు సూచనలు చేస్తామన్నారు. ఎవరికైనా ఆపరేషన్ అవసరం ఉంటే రాయితీ పైన చేస్తామని వైద్యులు వివరించారు. వైద్య శిబిరంలో ఉచితంగా మందులు మందులు పంపిణీ కూడా చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడు ప్రాంత రైల్వే సమస్యలపై దృష్టి సారించండి

◆రైల్వే సమస్యలను పరిష్కరించి.. మేలు చేయండి

◆గుంటూరు డివిజన్, పార్లమెంట్ నియోజకవర్గ రైల్వే సమస్యలను రైల్వే జీఎం కు వివరించిన ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు



గుంటూరు, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: పల్నాడు వెనుకబడిన ప్రాంతంగా ఉందని, ఈ ప్రాంతంలోని రైల్వే సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చేయాలని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానాన్ మాల్యాను కోరారు. గురువారం విజయవాడ లోని, ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ ( రైల్వే కార్యాలయంలో) జీఎం ఆధ్వర్యంలో జరిగిన రైల్వే సమావేశంలో ఏపీ లోని ఎంపీ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు గుంటూరు డివిజన్, నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యల్ని వివరించారు. ప్రస్తుతం ఉన్న గుంటూరు- గుంతకల్లు మార్గానికి అనుసంధానించే న్యూపిడుగురాళ్ల-శావల్యాపురం మధ్య కొత్త లైన్ పూర్తి దశలో ఉంది. ఈ కనెక్షన్‌లో మిగతా విద్యుదీకరణ పనులు త్వరగా పూర్తి చేసి లైన్‌ను ప్రారంభించాలని కోరారు. గద్వాల్- మాచర్ల లైన్ ముంబైకి మరియు ఈ మార్గంలో ముఖ్యమైన ప్రదేశాలకు దూరం తగ్గిస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా ఈ మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలని అభ్యర్థించారు. నల్లపాడు- పగిడిపల్లి మధ్య ఉన్న లైన్‌ను డబుల్ లైన్ చేయాలని కోరారు. అలాగే జిల్లాలోని చిట్టచివరి స్టేషన్ల అయిన మాచర్ల, రేపల్లె నందు ..పిట్‌లైన్స్ ఏర్పాటు చేయాలని, మెయింట్‌నెట్ కోసం వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. గుంటూరు జంక్షన్ నుండి న్యూఢిల్లీ మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టండి. పల్నాడు ప్రాంతం మిర్చి తదితర వాణిజ్య పంటలకు కేంద్రంగా, పారిశ్రామిక ప్రాంతంగా వెలుగొందుతుంది. కానీ, ఇక్కడి నుండి ఢిల్లీకి వెళ్లాలంటే రైలు కోసం విజయవాడ, సికింద్రాబాద్ వెళ్లాల్సిన పరిస్థితులు. అందువల్ల పల్నాడు ప్రాంతం గుంటూరు నుండి న్యూఢిల్లీకి అన్ని తరగతుల డైరెక్ట్ రైళ్లు ప్రవేశపెట్టాలని అభ్యర్థించారు. గుంటూరు నుండి నరసరావుపేట, మార్కాపురం, నంద్యాల ప్రాంతం మీదుగా వారణాసికి నేరుగా వారానికి ఒకసారి ఎక్స్‌పెస్ రైల్‌ను ప్రవేశపెట్టాలని అభ్యర్థించారు. నరసరావుపేట నుండి గుంటూరు, విజయవాడ మధ్య రైళ్లు తక్కువగా ఉన్నాయని, దీన్ని పరిష్కరించాలని కోరారు. నరసరావుపేట జిల్లాగా మారుతున్న నేపధ్యంలో గుంటూరు నుండి నరసరావుపేటకు మరియు గుంటూరుకు ఎక్స్‌ప్రెస్ రైల్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. మాచర్ల నుంచి గుంటూరు మధ్య ప్యాసింజర్ రైళ్ల సదుపాయం తక్కువగా ఉందని, మాచర్ల నుండి ఉదయం 5.30గంటలకు, సాయంత్రం 4.30గంటలకు మాత్రమే రైలు ఉందని, మద్యాహ్న సమయంలో గుంటూరు నుండి మాచర్లకు ఎటువంటి కనెక్టివిటీ లేదని పేర్కొన్నారు. గుంటూరు నుండి మాచర్ల మధ్య.. గుంటూరు నుండి మద్యాహ్నం 2గంటలకు బయలుదేరి 4.30గంటలకు చేరుకునేలా, ఇదే రైలు మాచర్ల నుండి సాయంత్రం 6గంటలకు ప్రారంభమై రాత్రి 10గంటలకు గుంటూరుకు చేరుకునేలా ఇంటర్ సిటీ రైల్ ను పెట్టాలని అభ్యర్థించారు. ప్రజలు, రైతుల ప్రయోజనాల దృష్ట్యా లెవల్ క్రాసింగ్ గేట్‌ల స్థానంలో అవసరమైన చోట ఆర్‌యుబిలు, ఆర్‌ఓబీల నిర్మాణాలు చేపట్టాలని అభ్యర్థించారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా నడుస్తున్న ఉద్యోగుల ప్రత్యేక రైలు(02795) ఎక్కడా ఆగటం లేదని, ఈ రైలు నడికుడి జంక్షన్‌లో ఆగితే పల్నాడు ప్రాంతానికి సాయంత్రం సమయంలో సికింద్రాబాద్ చేరుకోవడానికి మెరుగైన కనెక్టివిటీ ఉంటుందని తెలిపారు. ఫలక్‌నూమా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(02704) సత్తెనపల్లిలో ఆగేలా చూడాలని కోరారునరసరావుపేట జిల్లా కేంద్రంగా మారబోతున్నందున.. ఈ స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్ పొడవును పొడిగించాలని, జిల్లా కేంద్రాల నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని, స్టేషన్ వాతావరణాన్ని పచ్చని ప్రదేశాలతో సహా అందంగా తీర్చిదిద్దాలని అభ్యర్థించారు. పల్నాడు ప్రాంతంలో నరసరావుపేట పెద్ద వ్యాపార కేంద్రంగా ఉందని, పెరుగుతున్న అవసరాల దృష్ట్యా నరసరావుపేట యార్డును మరింత అభివృద్ధి చేయాలని అభ్యర్థించారు. సత్తెనపల్లి స్టేషన్ లో మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్‌లతో అదనపు భవనాలు అవసరం ఉందని వెల్లడించారు. పిడుగురాళ్ల స్టేషన్ లో ప్రధాన రహదారి నుండి స్టేషన్ రోడ్డు విస్తరణ, ప్లాట్‌ఫాం నెం .2 వద్ద టాయిలెట్ల నిర్మాణం, రైలు నంబర్ డిస్‌ప్లే బోర్డులు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు గురించి వివరించారు. భావనగర్ ఎక్స్‌ప్రెస్ 17203/17204 ఈ స్టేషన్‌లో నిలుపుదల గురించి విజ్ఞప్తి చేశారు. నడికుడి జంక్షన్ లో..ఉద్యోగులకు సంబంధించిన ప్రత్యేక ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ 02795/02796 నడికుడి జంక్షన్ వద్ద ఆపాల్సిన అవసరం ఉందని, రైల్వే పోలీస్ ఫోర్స్ స్టేషన్‌ను పునర్ నిర్మించాలని మరియు స్టేషన్‌లోని అన్ని మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు రైల్వే డివిజన్ ప్రాంతంలో ప్రతిపాదించిన నాలుగు రైల్వే విశ్వవిద్యాలయాల్లో ఒకటి అత్యవసరంగా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంతో పాటుగా గుంటూరు జిల్లాలోని రైలు ప్రయాణీకులు, రైతులు, అగ్రిటేడర్ల సౌకర్యార్థం పై సమస్యలను త్వరితగతిన పరిశీలించి, పరిష్కరించాలని రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యాను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థించారు.

## రేవేంద్రపాడు ఉన్నత పాఠశాల వరకు ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరించండి

**విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ ఆర్ యం మరియు విజయవాడ డిపో 1 మేనేజర్ కు బి జె పి ఎస్సీ మోర్చా కోనసీమ జోనల్ ఇంచార్జ్ మేకల లక్ష్మణ్ విజ్ఞాపన**



మంగళగిరి, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: తాడేపల్లి మండలం, పాతూరు గుండిమెడ మరియు మెల్లంపూడి గ్రామాల నుండి విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత విద్య కోసం రేవేంద్రపాడు జడ్పీ హై స్కూల్ కి వెళ్ళవలసి ఉండగా స్కూల్ కి వెళ్లనున్న విద్యార్థిని విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక నిత్యం ఆటో లు మరియు ద్విచక్రవాహనాలపై వెళుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి మార్గం గుండా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురైన ఘటన కూడా ఉన్నాయి. విద్యార్థి విద్యార్థినుల యొక్క ఈ సమస్యలు గుర్తించిన భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా కోనసీమ జోనల్ ఇంచార్జ మేక లక్ష్మణ్ (జాన్ బాబు) పిల్లలకు ఎదురవుతున్న ఇబ్బందులను విజయవాడ పండిట్ జవహర్లాల్ నెహ్రూ బస్ స్టాండ్ ఏపీ ఆర్ టి సి రీజినల్ మేనేజర్ ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాగా రీజినల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సర్వీస్ రూట్ నెంబర్ 215 సంబంధించి విజయవాడ 1 డిపో మేనేజర్ కే బసవయ్య ను కలిసి విద్యార్థుల సమస్యలను వివరించారు. డిపో మేనేజర్ కె బసవయ్య మాట్లాడుతూ సదరు స్కూల్ పిల్లల సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వీస్ నెంబర్ 215 లో రేవేంద్రపాడు హైస్కూల్ వరకు చర్చించి బస్సు ఏర్పాటు చేసే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



నరసాపురం, సెప్టెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ప్రజా సమస్యలపై అదికారులు దృష్టి సారించాలని నరసాపురం శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు.గుడ్ మార్నింగ్ నరసాపురం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 8 వ వార్డులో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. వార్డులో పర్యటిస్తూ ప్రజలు చెప్పిన సమస్యలను విని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.తదుపరి 4 వ సచివాలయంలో సచివాలయ అధికారులు, వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కుల, మత, ప్రాంత, పార్టీ తారతమ్యాలు ఎక్కడా ఉండకూడదని ప్రతీ సమస్య మీద అధికారులంతా దృష్టి సారించాలని అన్నారు. సంక్షేమ కార్యక్రమాల జాబితా సచివాలయం వద్ద పొందుపరచాలని సమస్యల పరిష్కారం కోసం సచివాలయం వద్దకు వచ్చినవారిని ఆప్యాయంగా పలకరిస్తూ సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. శానిటేషన్ విషయంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని డ్రైన్లలోని సిల్ట్ వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు.8 వ వార్డులో ప్రజలకు అవసరమైన డ్రైనేజ్, రోడ్లకు సంబంధించి జాబితా ఎస్టిమేషన్ తయారుచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ ,వైస్ చైర్ పర్సన్ కామన నాగిణి, వైసిపి పట్టణ అధ్యక్షుడు భూసారపు జయప్రకాష్, బర్రి శంకర్, వైకేయస్, మునిసిపల్ కమిషనర్ సత్యవేణి, చింతా మహా విష్ణు, అద్దంకి ఏసు, గోరు సత్తిబాబు, కావలి నాని, రెడ్డప్ప దవెజి, వనమాడి శ్రీను, రేఖా బాబీ, బర్రి శ్రీనివాస్, కొల్లాటి తిలక్, మాద్రాజు, కొపనాతి వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు..

## ఆదమరిస్తే అనంత లోకాలకే..



పెనుగంచిప్రోలు, సెప్టెంబర్1(ప్రజాపాలనప్రతినిధి) : పెనుగంచిప్రోలు గ్రామం నుంచి అనిగండ్లపాడు వెళ్లే రహ దారి గుంతల మయం, పట్టించుకోని ఆర్ అండ్ బి అ ధికారులు గత మార్చి నెలలో శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి చిన్న తిరణాల మహెూత్సవం లో భాగంగా అని గండ్లపాడు గ్రామం నుంచి పసుపు కుంకుమ బండ్లు వెళ్లేటప్పుడు ఈ గుంతలలో ఏదైనా ప్రమాదం జర గవచ్చని మార్చి 22వ తేదీన మన ప్రజాపాలన పేపర్ లో వచ్చిన కథనానికి స్పందించిన అప్పటి శ్రీయూక్త కలెక్టర్ ఇతియాజ్ ఆర్ అండ్ బి అధికారులను హె చ్చరించ గా ,మరుసటి రోజు ఉదయానికి రోడ్లు సా ధారణ మరమ్మతులు చేశారు, తర్వాత ఏప్రిల్, మే నెలలో పూర్తిగా మరమ్మతులు చేస్తామని హామీ ఇ చ్చారు కానీ ఇప్పటి వరకు పట్టించుకోలేదు మొన్న కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లి రోడ్లు మొత్తం బాగా పాడైపోయింది, ఆదమరిచి ఈ రోడ్ లో ప్రయాణిస్తే అనంతలోకాలకు వెళ్లాల్సిందే అని ప్రజలు అంటున్నారు,ఇదే రోడ్లో గతంలో రాత్రిపూట వాహ నా లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘ టనలు కూడా ఉన్నాయి,కావున ఇప్పటికైనా అధికా రులు దీన్ని పై దృష్టి పెట్టి ఈ సమస్యను పరిష్క రిం చాలని అనిగండ్లపాడు గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## ఎంపీలతో సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం భేటీ



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్ర ఎంపీలతో సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం గజానన్ గురువారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధుల విడుదలపై చర్చించనున్నారు. ప్రాజెక్టులలో పూర్తి ఖర్చు తామే భరించలేమని రైల్వే చెబుతోంది. పెండింగ్ నిధులు, ప్రాజెక్టుల జాప్యంపైనా భేటీలో చర్చించనున్నారు. ఈ సమావేశానికి విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్ల పరిధిలోని ఎంపీలు కనకమేడల, అయోధ్య రామి రెడ్డి, మార్గాని భరత్, గోరంట్ల మాధవ్, లావు శ్రీ కృష్ణ దేవరాయలు, వంగా గీత, సత్యవతి, ప్రభాకర్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రెడ్డప్ప, బ్రహ్మానంద రెడ్డి, తలారి రంగయ్య, అనురాధ హాజరయ్యారు. ఎంపీలు గల్లా జయదేవ్, కోటగిరి శ్రీధర్, కేశినేని నాని, బాలసౌరి కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. కాగా విజయవాడ డివిజన్‌కు సంబంధించిన ప్రతిపాదనలను కేశినేని నాని తన ప్రతినిధుల ద్వారా పంపించారు.

# నవరత్నాలను ప్రజలందరికీ అందేలా చూడాలి

## ఎంపీపీ సురేష్ ను అభినందించిన మంత్రి కొడాలి నాని



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి సెప్టెంబర్ 30: సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలను ప్రజలందరికీ అందేలా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. గురువారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని గుడ్లవల్లేరు ఎంపీపీ కొడాలి సురేష్, శ్రీ కొండాలమ్మ దేవస్థానం చైర్మన్ కనుమూరి రామిరెడ్డి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొడాలి నానికి పుష్పగుచ్ఛాలను అందజేసి పూలమాలతో సన్మానించారు. గుడ్లవల్లేరు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన కొడాలి సురేష్ ను మంత్రి కొడాలి నాని అభినందించారు. శ్రీ కొండాలమ్మ దేవస్థానం చైర్మన్ కనుమూరి రామిరెడ్డిని పూలమాలతో సత్కరించారు. గుడ్లవల్లేరు ఎంపీపీగా కొడాలి సురేష్ ను ఎంపిక చేయడం పట్ల మంత్రి కొడాలి నానికి, వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో 32 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, ఎన్నికలకు ముందే ఐదు స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా గెల్చుకుందని చెప్పారు. 27 ఎంపీటీసీ సెగ్మెంట్ లో ఎన్నికలు జరిగాయని, అన్ని స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. అలాగే గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు జడ్పీటీసీ స్థానాలను కూడా వైసీపీ కైవసం చేసుకుందని అన్నారు. ఎన్నికలు ఆలస్యంగా జరిగినా ఫలితాలు మాత్రం ఏకపక్షంగా ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రజలు సీఎం జగన్మోహనరెడ్డితోనే ఉన్నారని పరిషత్ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయన్నారు. సీఎం జగన్మోహనరెడ్డిపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు పట్టించుకోలేదన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రభుత్వ కార్యక్రమాలను అర్హులైన పేదలకు అందేలా చూడాలన్నారు. పేదప్రజల కష్టాలను స్వయంగా చూసిన సీఎం జగన్మోహనరెడ్డి వాలంటీర్ల, సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, ఏవైనా సమస్యలు వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి కొడాలి నాని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాలేటి చంటి, అల్లూరి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగన్న, గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎండీ బాజీ తదితరులు పాల్గొన్నారు.

## రామన్న మోడీ లింక్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తా: బంటుమిల్లి ఎంపిపి వెలివెల చినబాబు

బంటుమిల్లి సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: దీర్ఘకాలంగా ఉన్న రామన్న మోడీ నుండి చౌ రం పూడి వెళ్లే లింక్ రోడ్డు (900 మీటర్లు) కృషి చేస్తానని బంటుమిల్లి ఎంపీపీ వేలవేల చిన్న బాబు అన్నారు గురువారం ముళ్ళ ప్రు పంచాయతీ పరిధిలోని రామన్న మోడీ గ్రామానికి సర్పంచ్ బొడ్డు మంగమ్మ తో కలసి రోడ్డును పరిస్థితి పరిశీలించారు ఈ సందర్భంగా చిన్న బాబు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు జోగి రమేష్ దృష్టికి సమస్యను వివరించామని ఆయన ఆదేశాల మేరకు గ్రావెల్ రోడ్డు వచ్చే వేసవి నాటికి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు చుట్టూ చెరువులు మూలంగా రోడ్డును మెరక చేసిన తరువాత గ్రావెల్ రోడ్డు వెయ్యాలని గ్రామస్తులకు తెలిపారు అయితే తూములు క్రింది భాగంలో ఉండడంతో అవి మార్చేందుకు సర్పంచ్ బొడ్డు మంగమ్మ చర్యలు తీసుకుంటానన్నారు ఈ రోడ్డు వేస్తే రామన్న మోడీ నుండి చౌ రంపూడి హై స్కూల్ కి వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు పడకుండా ఉంటారని చిన్న బబు అన్నారు అది కాక షోరమ్ పూడి మల్లంపూడి మీదుగా మూలలంక కలిదిండి భీమవరం వెళ్లే వారికి ఈ రోడ్డు దగ్గరగా ఉంటుందని ఆయన అన్నారు అతి త్వరలోనే మా గ్రామ సమస్య పరిష్కరించి గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేయాలన వైస్ ఎంపీపీ ఓ డిమే చిన్నారి బాబు ఎంపీపీ చినబాబు కు తెలియజేశారు ఈ రోడ్డుకు 15 లక్షల వ్యయంతో ప్రపోజల్ పంపించినట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు ఎంపీడీవో వెంకటలక్ష్మి బొడ్డు నాగరాజు నడక ది టి వెంకటస్వామి పి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ కాలేజ్ సామాజిక సేవా దృక్పథం ప్రశంసనీయం



చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య సామాజిక సేవాదృక్పథం ప్రశంసనీయమని, డిఎస్పీ పీ.శ్రీకాంత్ అన్నారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన బారికేడ్స్‌ను, డిఎస్పి. పి.శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్లికాగర్గ్ పిలుపుమేరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సంప్రదించగా, వెంటనే యాజమాన్యం స్పందించిన తీరు అభినందనీయం అన్నారు. ప్రజా సంక్షేమము కోరి భారి బారికేడు రూపొందించినట్లు, చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, కళాశాల సెక్రటరి వనమా.రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల.లక్ష్మణరావు, ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు సంయుక్తముగా ఒక ప్రకటనలో తెలియజేశారు. 2001వ సం.లో స్థాపించిన, ప్రముఖ సెయింట్‌ఆన్స్‌కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి,ఈ మధ్య తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యములో, తనవంతు భాద్యతగా నేషనల్ హైవే – 5 మీద నెలకొల్పడానికి, లక్ష రూపాయల వ్యయముతో, భారి బారికేడ్‌ను రూపొందించినట్లు,కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు తెలియజేశారు. కళాశాలలోని సీమెన్స్ కార్పోరేషన్ సహకారముతో నిర్మించిన,సీమెన్స్‌ప్రయోగశాలలో రూపొందించిన డిజైన్ ప్రకారము,తయారు చేయటం జరిగినదని తెలిపారు. బారికేడ్స్, అనేవి ప్రజలను వాహనాల వలన జరిగే ప్రమాదాలకు గురికాకుండా, సంరక్షించటానికి, ప్రయాణీకులకు సూచనలు ఇవ్వటానికి, ప్రమాదాలనుగురించి హెచ్చరించటానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమములో కళాశాల సెక్రటరి మరియు కరస్పాండెంట్ పాలు పంచుకున్నారు. సామాజికశ్రేయస్సే ధ్యేయంగా, బారికేడు అందజేసినసంస్థ సెయింట్‌ఆన్స్ అని, నేటి సమాజానికి విపత్తులను అడ్డుకునేందుకు,బారికేడ్స్ అవసరమని, ప్రజల క్షేమము కోరి,ఈ బారికేడు సెయింట్ ఆన్స్ సంస్థ అందజేయటం అభినందించదగ్గ విషయమని డి.యస్.పి శ్రీకాంత్ తెలియజేశారు. గో స్లో, సేఫ్ ఫస్ట్ అనే నినాదములతో, అతి వేగము ప్రమాదకరం ప్రయాణించే సమయములో జాగ్రత్తగాఉండటం అవసరమయ్యే విషయాలు, ప్రయాణీకులకు గుర్తు చేసే విధముగా, బారికేడ్ను తయారు చేయటం జరిగినదని, అత్యధిక వాహనాలట్రాఫిక్‌లో, ప్రజలు నియమ నిబంధనలు పాటించేలా చేసే నేపధ్యములో,కళాశాల జాతీయసేవావిభాగము వారి ఆధ్వర్యములో, వీటిని అందించటం జరిగినదని,కళాశాల యాజమాన్యం తెలియజేశారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసినసబ్ కలెక్టర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్



జగ్గయ్యపేట, సెప్టెంబర్30 (ప్రజాపాలనప్రతినిధి) : జగ్గయ్యపేట టౌన్ పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసి పోలీసు స్టేషన్ రికార్డులను, క్రైమ్ రేటును, వివిధ సెక్షన్ల క్రింద నమోదు చేసిన కేసుల వివరాలను ఫోక్స్ చట్టము క్రిం ద నమోదు అయిన కేసులను సమీక్షించినా రు,తదు పరి జగ్గయ్యపేట టౌన్ పోలీసు స్టేషన్ లో ప్రజలకు అందుచున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్య క్తం చేసినారు,తదుపరి స్థానిక తహశీల్దార్ వారి కా ర్యాలయము, జగ్గయ్యపేట నందు ఫోక్స్ చట్టం, దిశ యాప్ పై అవగాహన మరియు కోమల్ యానిమేషన్ షార్ట్ ఫిలిమ్ తదితర అంశాల పై విద్యార్థులకు అవ గాహన కల్పించుటకు గాను,కార్యాచరణను రూపొం దించుటకు సమీక్ష నిర్వహించి, ఎంపీడీఓ , యంఈఓ , తహసీల్దార్ మరియు పోలీస్ వారి సహకారముతో ఒక రోజు అన్నీ ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమము ఏర్పాటు చేయవలసినదిగాఆదేశించియు న్నారు, త దుపరి షేర్ మహమ్మద్ పేట గ్రామములో జరుగు చు న్న రీ సర్వే పై సమీక్షించి అన్ని రికార్డులను సక్రమము గా తయారు చేయాలని సర్వేయర్ల ను ఆదేశించి యు న్నారు,తదుపరి రైతుబజారు ప్రక్కనే వున్న పబ్లిక్ టా యిలెట్లను పరిశీలించి మైంటెనెన్సు సరిగా లేదని, పరి శుభ్రతను పెంచుటకు స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ వా రిని ఆదేశించియున్నారు మరియు ఇంకనూ పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు చేయుటకు అనువైన స్థలము లను ఎంపిక చేయవలసినదిగా తహశీల్దార్, జగ్గయ్య పేట వారిని ఆదేశించియున్నారు,ఈ కార్యక్రమములో శ్రీ పి వైకుంఠ రావు, తహశీల్దార్, జగ్గయ్యపేట, శ్రీ టి జయచంద్ర గాంధీ, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, జగ్గయ్యపేట, శ్రీ చంద్ర శేఖర్, సర్కల్ ఇన్స్పె క్టర్ జగ్గయ్యపేట, శ్రీ డి రవీందర్, మండల విద్యాధి కారి, జగ్గయ్యపేట, శ్రీ యన్ నాగరాజు, డిప్యూటీ త హశీల్దార్, జగ్గయ్యపేట, సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీ చిన్న బా బు, రామారావు మరియు మండల రెవెన్యూ ఇన్స్పె క్టర్, మండల సర్వేయర్, పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసి తీర్ధ ప్రసాదాలు అందజేసిన ద్వారకా తిరుమల ఈవో



ఏలూరు, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ను ద్వారకాతిరుమల ఈవో జీవీ సుబ్బారెడ్డి కలిసి శ్రీ స్వామి వారి ప్రసాదము అందచేశారు..భక్తుల సౌకర్యార్థం ద్వారకాతిరుమల నుండి భీమడోలు రోడ్డు మార్గాన్ని అభివృద్ధి పరచాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు..

# గంగానమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



భీమవరం, సెప్టెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) : గంగానమ్మ అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రతి ఒక్కరిమీద ఉండాలని భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక రెస్ట్ హౌస్ రోడ్డు శివారున వెలసిన శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ శ్రీ గంగానమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా అమ్మవారి జాతర మహోత్సవాలను వ్యయ,ప్రయాసలతో ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, వైసిపి నాయకులు తోట భోగయ్య, జలాలుద్దీన్ బాబా, తిరుమాని ధనుంజయ, జవ్వాది సత్తిబాబు, ఆలయ నిర్వాహకులు కాసరపు శ్రీనివాసరావు, కరుకు శ్రీను, కొండమ్మ, పోతురాజు, రిట్టా శ్రీను, గురుముత్త, ఏడుకొండలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని నాశనం చేశారు: తెదేపా



కావలి సెప్టెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి :వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రాన్ని నాశనం చేశారని తెదేపా నాయకులు తెలిపారు గురువారం తెదేపా డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కండ్లగుంట మధుబాబు నాయుడు ,జిల్లా రైతు ఉపాధ్యక్షులు శ్రీహరి నాయుడు ,మాజీ మున్సిపల్ ఛైర్మన్ గ్రంధి యానాది శెట్టి లు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 25 సంవత్సరాలు వెనుకకు నెట్టి వేయబడిందని అన్నారు. సంక్షేమ పథకాలు వల్ల ప్రజలను మోసం చేసి వారి నుండి ఏదో ఒక రూపం నుండి వసూల్ చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అన్న వస్తే నిత్యావసర సరుకుల ,కరెంట్ బిల్లులు తగ్గిస్తానని పాదయాత్ర లో ఇచ్చిన హామీలను తుంగలో త్రోక్కారని , ఇళ్ల నిర్మాణం కు ఇసుక ఫ్రీగా ఇస్తానని చెప్పి ,ప్రస్తుతం ట్రక్కు 9 వేల రూపాయలు వసూల్ చేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో 10 పెంక్షన్లు తొలగించడం జరుగుతోందని ,వైకాపా ప్రభుత్వ లక్ష్యం రాష్ట్రంలో 2 లక్షల పైచిలుకు పెంక్షన్లు తొలగించే ప్రక్రియలో ఉన్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై దాడి జరిగి 15 రోజులు అవుతున్న దాడులకు పాల్పడిన వారిని ఇంతవరకు వారి పై చర్యలు చేపట్ట లేదని వాపోయారు. దేశంలో ఉన్న ముఖ్యమైన వ్యక్తులలో ఒకరైన చంద్రబాబు నాయుడు ని అవమానించడం సరైన ధోరణి కాదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి నియంత పాలనను వ్యవహరిస్తున్నారని అన్నారు. అమరావతిని రాజధానిగా చేస్తానని ,ఇప్పుడు మూడు రాజదానులుగా ప్రకటించటం , వీటి వెనుక ఉన్న అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ స్వలాభం కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించారు.తెదేపా ప్రభుత్వం లో వృద్ధుల ,వితంతు పెంక్షన్లు 2 వేల రూపాయలు ఇచ్చారని ,వైకాపా ప్రభుత్వం వచ్చిన వెంటనే మూడు వేల రూపాయలు ఇస్తానని ప్రకటించి ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వైకాపా ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మాజీ హాస్పిటల్ ఛైర్మన్ గుత్తికొండ కిషోర్ ,గొర్రిపాటి బ్రహ్మయ్య ,గొట్టిపాటి మురళీ , రాము ,మైనంపాటి జగదీశ్ ,బట్టేపాటి అశోక్ ,రవి యాదవ్ ,కంచర్ల రఘు ,బాలమురళీ ,వోర్ల శ్రీనివాసులు ,కొత్తపల్లి రవి ,మార్కం0డేయులు ,గంగినేని సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గోపాలకృష్ణ దాతృత్వ సహకారంలో రాష్ట్ర ఉద్యోగులందరికి మార్గదర్శకం

చీరాల(ఒంగోలు)సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: : వేటపాలెం ఎయిమ్ ఫర్ సేవ, జీవీకేసీ అనాధవిద్యార్థుల వసతిగృహంలో ,విద్యార్థులకు మరింత మెరుగైనవసతి, ఇంకొంతమందికి వసతి కల్పన కై, నూతన వసతి భవన విద్యుదీకరణ నిమిత్తం మరియు స్టీల్ మంచముల కోసం , విరాళం కోరగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ విభాగం ఆర్థిక విభాగం డైరెక్టర్, వేటపాలెం వాసి,పట్టభద్రుల సంఘం సభ్యులు వూటుకూరి వెంకట గోపాల కృష్ణమూర్తి వెంటనే స్పందించి విద్యుదీకరణ పూర్తిచేస్తామని, భరోసా ఇవ్వటం హర్షనీయమని పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి.వెంకటసుబ్బారావు అన్నారు. యీ సందర్భంగా సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ, గోపాలకృష్ణ దాతృత్వసహకారంలో రాష్ట్ర ఉద్యోగులందరికి మార్గదర్శికంగా ఉండేవిధంగా, ఉద్యోగము వచ్చినప్పటి నుండి, నేటి వరకు కూడా ప్రతినెల క్రమం తప్పకుండా, తన జీతంలో కొంతభాగం ముఖ్యమంత్రి సహాయనిధికి, విరాళం అందజేయడం గొప్ప విషయం అని ప్రశంసించారు. ఉద్యోగులలో సేవా తత్వంకు మార్గదర్శిగా స్ఫూర్తినిచ్చారన్నారు. వారు తమ స్వగ్రామంలో స్వామి దయానంద సరస్వతిస్వామి ప్రేరణతో ఏర్పాటు అయి, స్వామి స్థైర్యనందస్వామి పిలుపుకు చేయూత యివ్వడం, చాలా ఆనందంగా వుండటమే గాక, పట్టభద్రుల సంఘసేవలకు మరింతగౌరవం పెరిగిందన్నారు. యీ సందర్భంగా వూటుకూరి కోటిస్వామి గుప్త, బర్రా సాంబశివ,సేవక్ సుబ్రహ్మణ్యం, శాలివాహన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటిపల్లి చిరంజీవి, గౌడ సంఘం నాయకులు డీవీఆర్ నాగరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

– దాతృత్వమూర్తులకు కృతజ్ఞతలు

అదేవిధంగా 20మంచములు చీరాల వేమా.ఆదిశేషు, మంచములకు ప్లేవుడ్‌ను, పట్టభద్రుల సంఘం సహాయ కార్యదర్శి, సుంకర జయకృష్ణ ఎన్.వి.యల్.ప్రసాద్, కుమార్తె రవళి, సంఘసభ్యులు కొల్లిశెట్టి.వెంకటగణేష్‌బాబు పరుపులు, జంజనం.సురేంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. ఎయిమ్‌ఫర్‌సేవకు సహకారం అందించి, విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించిన దాతృత్వమూర్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు భోజనం చేసేందుకు అనువుగా ఉండేందుకుగాను,15 డైనింగ్ టేబుల్స్, 30ప్లాస్టిక్ చైర్స్ 30.అవసరమని, వాటిని అందించేందుకు దాతలు తమ సహకారం అందించాలని, మీ పట్టభద్రుల సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు కోరారు.

## జమిందారీ భూముల సమస్యకు పరిష్కారం చూపాలి



నరసాపురం, సెప్టెంబరు 30 (ప్రజాపాలన ప్రతినిధి) : చిరకాలంగా పెండింగ్ లో ఉన్న జమిందారీ భూములు, కంపెనీ భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు మేలుజరిగేలా చూడాలని నరసాపురం శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు అధికారులను కోరారు. దీర్ఘ కాలికంగా పెండింగ్ లో ఉన్న మొగల్తూరు మండలం కాళీపట్నం జమీందారి 7,500 ఎకరాల భూములు, నరసాపురం మండలం దర్భరేవు కంపెనీ లాండ్స్ 1754 ఏకరాల భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అయాగ్రామాల రైతులు, ప్రజలకు మేలు జరిగేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి ఆర్.అంబేత్కర్ కు ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేత్కర్, శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు ఆయా గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో రెండు విడతలుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల కాలంగా ఈ భూముల సమస్య పరిష్కారం కాకుండా పెండింగ్ లో ఉందన్నారు. ఆయా గ్రామాల నాయకులు, రైతులకు సంబంధిత భూములపై ఇప్పటివరకు జరిగిన సంఘటనలు, న్యాయస్థానాల తీర్పులు, ఇప్పటివరకు జరిగిన కాలయాపన తదితర విషయాలు రైతులు, ,నాయకులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జాయింట్ కలెక్టర్ బి.ఆర్. అంబేత్కర్ మాట్లాడుతూ రెండు గ్రామాల భూములపై ప్రత్యేక దృష్టిపెట్టి రైతులకు, ప్రజలకు న్యాయంజరిగేలా చూస్తామని అన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# గన్నవరం ఆంధ్రా బ్యాంకులో చోరీ

విజయవాడ, సెప్టెంబరు 30, ప్రజాపాలన ప్రతినిధి: గన్నవరం ఆంధ్రా బ్యాంకులో చోరీ జరిగింది. సీసీ పుటేజ్ ఆధారంగా చోరీకి పాల్పడిన మహిళ, ఇద్దరు పిల్లల వివరాలను స్థానిక పోలీసులు సేకరిస్తున్నారు. ఇద్దరు పిల్లలతో ఓ మహిళ బ్యాంకుకు వచ్చింది. ఈ క్రమంలోనే బ్యాంకుకు వచ్చిన వేరే మహిళ బ్యాగు నుంచి 65 వేల రూపాయల డబ్బును కాజేసి ఇద్దరు పిల్లలతో కలిసి పరారైంది. గన్నవరం పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

# కేన్సర్ గుట్టు జన్యువుల్లో...



దర్జీ ఎవరి శరీర కొలతలకు తగ్గట్టు, వారికి దుస్తులు కుడతాడు. అలాంటిది... కేన్సర్ విషయంలో రోగులందర్నీ ఒకే గాటన కట్టేసి....ఒకే వైద్య విధానం అనుసరించడం ఎంతవరకూ సమంజసం?వ్యాధి విస్తరణకు కారణాలు, కేన్సర్ తత్వాలను బట్టి చికిత్స చేయడం అవసరం.డిఎన్ఏ సీక్వెన్సింగ్, ట్యూమర్ ప్రొఫైలింగ్ లాంటి విధానాలతో కూడిన... 'ప్రెసిషన్ మెడిసిన్' దిశగా ప్రయోగాలు జరుగుతున్నాయి.ఈ అత్యాధునిక చికిత్సా విధానాలతో...కేన్సర్‌పై సంపూర్ణ విజయం సాధించే రోజులు మరెంతో దూరంలో లేవు అంటున్నారు...ప్రఖ్యాత కేన్సర్ నిపుణులు, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు! ఆయన ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

డాక్టర్ దత్తాత్రేయుడు నోరి అంతర్జాతీయ పేరు ప్రఖ్యాతులు గడించిన ఆంకాలజిస్ట్. మూడు దశాబ్దాలుగా న్యూయార్క్‌లోని కార్నెల్ మెడికల్ సెంటర్, ప్రొఫెసర్‌గా, ఆంకాలజీ ఛైర్మన్, కేన్సర్ సెంటర్ డైరెక్టర్‌గా దత్తాత్రేయుడు పలు బాధ్యతలను నిర్వహించారు. కేన్సర్ చికిత్సలో కొత్త విధానాలను రూపొందించి, ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాక కేన్సర్ రోగులకు తోడ్పడ్డారు. కేన్సర్ చికిత్సలో చేసిన కృషికిగాను అమెరికన్ కేన్సర్ సొసైటీ ఆయనను మోస్ట్ డిస్టింగ్విష్‌డ్ ఫిజీషియన్' అవార్డుతో సత్కరించింది. వైద్యరంగానికి ఆయన అందించిన సేవలకుగాను 2015లో భారత ప్రభుత్వం, దత్తాత్రేయుడిని పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.కేన్సర్ మీద వైద్యుల పట్టు పెరిగింది. కేసులు పెరుగుతున్నప్పటికీ మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. మొదటి దశలో గుర్తించి, నయమైపోతున్న కేన్సర్ కేసుల సంఖ్య ఎక్కువే! అయితే ప్రజల్లో కేన్సర్ పట్ల అవగాహన మరింత పెరగవలసిన అవసరం ఉంది. ఇప్పటికీ ఎక్కువ శాతం రోగులు వ్యాధి చివరి దశల్లో వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితి వైద్యపరమైన ప్రగతికి ఆటంకంగా మారుతోంది. అయితే కేన్సర్‌లో అద్భుతమైన చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తూనే ఉన్నాయి.అయినప్పటికీ కేన్సర్‌కు శాశ్వత అడ్డుకట్ట వేయడంలో వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించడం, ఆరోగ్య విద్య లాంటివే ప్రధానం. మెరుగైన, నాణ్యమైన చికిత్సలది వాటి తర్వాతి స్థానం. అయితే కేన్సర్ రేసులో విజయం సాధించాలంటే, పెరిగే కేసులకు చికిత్స అందిస్తూ వెళ్లడానికి బదులుగా, కేన్సర్ విస్తృతిని నియంత్రించే మార్గం కనిపెట్టడం అవసరం. వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించడం, ఆరోగ్య విద్య... ఈ రెండే ఇందుకు తోడ్పడతాయి.

కేన్సర్ అడ్డుకట్ట కోసం 'జీన్ సీక్వెన్సింగ్'

కేన్సర్‌కు సంబంధించిన మాలిక్యులర్ స్ట్రక్చర్ ఆధారంగా చికిత్స అందించే వైద్య విధానం ముమ్ముందు అందుబాటులోకి రానుంది. వంద మంది మొదటి దశ ఊపిరితిత్తుల కేన్సర్ రోగులందికీ కలిపి రెండు రకాల మందులు, కీమో థెరపీ ఇచ్చినప్పుడు, వాళ్లలో 60 మందికి చికిత్స ఫలితాన్నిస్తే, మిగతా 40 మందికి ఫలితం చూపించలేదు అనుకుందాం. అందరూ కేన్సర్ మొదటి దశలో, చిన్న కంతిని కలిగి ఉన్నప్పుడు సర్జరీ, కీమోథెరపీ, మందులతో వంద మందికీ చికిత్స సమాన ఫలితం చూపించాలి. కానీ కొంతమందికే ఫలితం దక్కడానికి కారణం, వంద ట్యూమర్లలో ఒక్కో కంతీ తనదైన జెనెటిక్ మాలిక్యులర్ స్ట్రక్చర్ ఆధారంగా పెరగడమే! పరుగు పందెంలో ఒక్కో వ్యక్తి లక్ష్యాన్ని చేరుకునే సమయం, వాళ్లు పరిగెత్తిన వేగం మీద ఆధారపడి ఉన్నట్టుగా కేన్సర్ పెరుగుదల కూడా, ఆ కంతి మాలిక్యులర్ సిగ్నేచర్ మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టే కేన్సర్‌కు ఒకే రకమైన మంత్రం పని చేయదు. మాలిక్యులర్ స్ట్రక్చర్ ఆధారంగా చికిత్స అందించగలిగితే, అనుసరించబోయే చికిత్సా ప్రక్రియలు సదరు కేన్సర్ మీద ప్రభావాన్ని చూపించగలవో, లేదో ముందుగానే కనిపెట్టవచ్చు. జీన్ సీక్వెన్సింగ్... ఏ వ్యక్తికి ఎటువంటి కీమోథెరపీ ఫలితం చూపిస్తుందో, తప్పుడు కీమోథెరపీ రోగి మీద ఎంతటి దుష్ప్రభావాన్ని చూపిస్తుందో తెలుపుతుంది. ఇలా జీన్ సీక్వెన్సింగ్ తోడ్పాటుతో, ప్రెసిషన్ ట్రీట్మెంట్‌లో భాగంగా చికిత్సను డిజైన్ చేసుకోవడం అవసరం.

జన్యు మార్కర్లను సరి చేయడం ద్వారా...

ఒక వ్యక్తికి అతని 50వ ఏట లంగ్ కేన్సర్ వచ్చే అవకాశాన్ని జీన్ సీక్వెన్సింగ్‌తో ముందుగానే కనిపెట్టే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలనీ, సదరు వ్యక్తిని హెచ్చరించవచ్చు. ఊపిరితిత్తుల కేన్సర్‌ను నాల్గవ దశలో గుర్తించిన రోగి జీవిత కాలం ఎనిమిది నెలలకు మించదు.

అలాంటి రోగికి జన్యు పరీక్ష చేసి, అసహజంగా ఉన్న కేన్సర్ మార్కర్‌ను గుర్తించి, ఆ మార్కర్‌ను సరిచేసే నోటి మాత్రలు అందించడంతో, ఆ వ్యక్తి ఆయుష్షు పదేళ్లకు పైగా పెరిగింది. మరో సందర్భంలో నాల్గవ దశ ఊపిరితిత్తుల కేన్సర్ రోగికి అందించిన కీమో థెరపీ ఫలితం చూపించకపోగా దుష్ప్రభావాలను కలిగించింది. ఆ సందర్భంలో బయాప్సీ, జీన్ అనాలసిస్ చేసి, అసహజంగా ఉన్న జన్యువును కనిపెట్టాం. లంగ్ కేన్సర్ కారకం ఆ జన్యువే! దాన్ని సరిచేసే మందులు వాడడంతో వ్యాధి అదుపులోకి వచ్చేసింది.

కేన్సర్‌కు జన్యువులే కారణమా?

కేన్సర్ వ్యాధిని ప్రేరేపిస్తున్నాయి కాబట్టి తప్పిదమంతా జన్యువులదే అనడం పొరపాటు. తప్పంతా దురలవాట్లతో ఆ జన్యువులను ప్రేరేపించే మనదే! మనం ఆ జన్యువులను ప్రేరేపించనంతకాలం అవి ఎటువంటి హాని కలిగించకుండా, నిద్రావస్థలోనే ఉంటాయి. నిజానికి శరీరాన్ని రోగగ్రస్థం చేసే ఎలాంటి కార్సినోజెనిక్ అయినా, కేన్సర్‌కు దారి తీస్తుంది. కాబట్టి కేన్సర్ కారకాల పట్ల అవగాహన ఏర్పరుచుకుని, అప్రమత్తంగా వ్యవహరించాలి.

ఆహారశైలి, జీవనశైలి, అలవాట్లను ఆరోగ్యకరంగా అనుసరించడంలో అలసత్వం వహించినా, పరిమితి మీరినా కేన్సర్ జన్యువులు మేల్కొంటాయనే విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలి. ప్రతి విషయంలో పరిమితి పాటించాలి. గాలి నింపవలసిన ఊపిరితిత్తులను నికొటిన్‌తో నింపితే, కొత్తగా పుట్టే కణాలు చనిపోయి, ఉన్న కణాలు విచ్ఛిత్తి జరిగి ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి దురలవాట్లనూ, ఆహారపుటలవాట్ల విషయంలో పరిమితి పాటించాలి. కాబట్టి కేన్సర్‌కు జన్యువులు ఓ కారకం మాత్రమే!

టార్గెటెడ్ ట్రీట్మెంట్, డిజైనర్ డ్రగ్స్

రోగి కేన్సర్ తత్వం, జన్యు నిర్మాణం ఆధారంగా ఎంచుకునే చికిత్సలో అనవసరపు మందులు, చికిత్సల వాడకం తగ్గుతోంది. మాలిక్యులర్ అనాలసిస్ ఫలితం ఆధారంగా ఎటువంటి మందులతో వ్యాధి అదుపులోకి వస్తుందో గ్రహించి, ఆ మందులనే అందించడం జరుగుతోంది. ఇది కేన్సర్ వైద్య చికిత్స సాధించిన ప్రగతి. ఇటువంటి చికిత్సా విధానం అంతటా అందుబాటులోకి వచ్చింది. కాబట్టి సంప్రదాయ కీమోథెరపీతో కేన్సర్ అదుపులోకి రావడం లేదని గ్రహించినప్పుడు, సత్వరం ఆ చికిత్సను ఆపి, బయాప్సీని పునఃపరీక్షించి చికిత్సను మార్చుకోవడం అవసరం. కీమోథెరపీ... సాలిడ్ ట్యూమర్లకు, లింఫోమా, ల్యుకేమియాలకు సమర్థంగా పని చేయగలదు.

ముదిరినా నిలువరించవచ్చు

మొదటి, రెండవ దశ కేన్సర్లను పూర్తిగా నయం చేసే వీలుంది. మూడు, నాల్గవ దశ కేన్సర్లను పూర్తిగా నయం చేయలేకపోయినా, అవి మరింత పెరగకుండా నిలువరించే చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. మధుమేహం మాదిరిగా మందులు వాడుకుంటూ, నాణ్యమైన జీవితాన్ని గడిపే వీలుంది.

కేన్సర్ పంచ సూత్రాలు

కేన్సర్ వ్యాధికి కారణం కచ్చితంగా తెలియదు కాబట్టి, వ్యాధి వచ్చినా దాంతో సమర్థంగా పోరాడే రోగనిరోధక వ్యవస్థను మెరుగ్గా ఉంచుకోవాలి. ఇందుకోసం ఈ పంచ సూత్రాలు పాటించాలి.

1. ఒత్తిడి దరిచేరనీయవద్దు: పరిమితమైన ఒత్తిడి వ్యాధినిరోధక వ్యవస్థను చేతనంగా ఉంచుతుంది. అయితే అది పరిమితికి మించితే ఇమ్యూనిటీ దెబ్బ తింటుంది. కాబట్టి వ్యాయామం చేయడం, స్నేహితులతో కలిసి కాలక్షేపం చేయడం, నచ్చిన అభిరుచిలో నిమగ్నమవడం లాంటి ఒత్తిడిని తగ్గించే అలవాట్లు అనుసరించాలి.

2. నిద్ర ముఖ్యం: నిద్ర లోపంతో మెరుగైన ఆహారం, వ్యాయామాల ఫలం దక్కకుండా పోతుంది. నిద్రలో కణాలు తమను తాము మరమ్మతు చేసుకుంటాయి. అలాంటి నిద్ర తగ్గితే, దాంతో పాటు వ్యాధినిరోధకశక్తి తగ్గి, తేలికగా రుగ్మతల బారిన పడతాం. నిద్ర విషయంలో సమయం, నాణ్యత రెండూ ముఖ్యమే! కంటి నిండా నిద్రతో ఇమ్యూనిటీకి చెందిన కణాల విధి నిర్వహణ మెరుగవుతుంది. కొత్తవీ, బలమైన కణాలు పుడతాయి. పాతవి అంతరిస్తాయి. కాబట్టి పగటి వేళ, నిద్రకు దూరం చేసే అంశాల అంతు చూసి, రాత్రికి కంటి నిండా నిద్రపోవాలి. ప్రతి రోజూ 6 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్ర పోవాలి.

3. మంచి ఆహారం: ఆహార పదార్థాల నుంచి పోషకాలను గ్రహించే శక్తిని జీర్ణవ్యవస్థ కోల్పోకుండా కాపాడుకోవాలి. పోషకాలు కలిగిన సమతులాహారం తీసుకోవాలి. ఆహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. పెరుగు, ప్రొబయాటిక్ సప్లిమెంట్లు పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరగడానికి తోడ్పడతాయి.

4 వ్యాయామం: వ్యాయామంతో రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. ఇన్‌ఫెక్షన్లు, ఒత్తిడిలను తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం 20 నిమిషాలకు తగ్గకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం అవసరం.

5. విటమిన్ డి లోపం: డి విటమిన్ కోసం రోజూ శరీరానికి ఎండ తగలనిస్తూ ఉండాలి. చేపలు, చేప నూనెలు, గుడ్లను తీసుకుంటూ ఉండాలి.

## అల్జీమర్స్ రాకుండా ఉండాలంటే..!



వయసు పైబడిన వారిలో కనిపించే సమస్య అల్జీమర్స్. దీనిబారిన పడిన వారిలో జ్ఞాపకశక్తి లోపించడం వల్ల రోజువారి జీవితం ఇబ్బందుల్లో పడుతుంది. అయితే ఆహార విధానాల్లో మార్పులు చేసుకోవడం ద్వారా అల్జీమర్స్ వచ్చే అవకాశాలను తగ్గించుకోవచ్చని అంటున్నారు పరిశోధకులు. వారు సూచిస్తున్న ఆహార పదార్థాలు ఇవి...

ఆకుకూరలు, బీన్స్, బెర్రీ, సీఫుడ్, ఆలివ్ ఆయిల్, నట్స్ వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి.

మెదడులో ప్రొటీన్ నిర్మాణానికి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అవసరమవుతాయి. వాల్‌నట్స్, ఫ్లాక్స్ సీడ్స్, ఆలివ్‌ఆయిల్‌లో ఈ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి.

ఆరెంజ్, బ్రొకోలి, స్ట్రాబెర్రీ, బాదం వంటివి అల్జీమర్ డెవలప్ అయ్యే అవకాశాలను తగ్గిస్తాయి.

మెదడులో కెమికల్ రియాక్షన్స్‌కు కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌ను వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు న్యూట్రలైజ్ చేస్తాయి.

ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉండే ఆపిల్స్, బ్లూబెర్రీ, క్రాన్‌బెర్రీ, గ్రేప్‌ఫ్రూట్స్, క్యాబేజీ, వెల్లుల్లి, కిడ్నీబీన్స్, పాలకూర, ఉల్లిపాయలు మెనూలో ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

పసుపులో ఉండే కుర్‌క్యుమిన్ ఆలోచించడం, నేర్చుకోవడం, గుర్తుపెట్టుకోవడం వంటి కాగ్నిటివ్ ఫంక్షన్స్ మెరుగయ్యేందుకు తోడ్పడుతుందని అధ్యయనాల్లో తేలింది.

బ్లూబెర్రీ, బ్లాక్‌బెర్రీ, స్ట్రాబెర్రీస్ వంటి వాటిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఆక్సిడెటివ్ స్ట్రెస్ నుంచి కాపాడటం ద్వారా మెదడు పనితీరు పెరిగేందుకు సహాయపడతాయి.

## నెలసరిలో ఇవి తినడం మానేయండి!



ఒళ్లు బరువుగా ఉండడం, రొమ్ముల్లో సలపరం, పొత్తికడుపులో నొప్పి లాంటి నెలసరి ఇబ్బందులు దూరం కావాలంటే ఆ రోజుల్లో కొన్ని పదార్థాలకు నో చెప్పేయాలి. అవేంటంటే...

కొవ్వులు: శాచురేటెడ్ ఫ్యాట్ ఎక్కువగా ఉండే పదార్థాలను నెలసరి సమయంలో మానేయాలి. మాంసాహారం, పాల ఉత్పత్తుల ద్వారా అందే ఈ కొవ్వులు ఈస్ట్రోజన్ హార్మోన్ మీద నేరుగా ప్రభావం చూపిస్తాయి. వీటిలో ఉండే ఆరాఖిడోనిక్ యాసిడ్ గర్భాశయ సంకోచ వ్యాకోచాలను ప్రేరేపించే ప్రోస్టాగ్లాండిన్స్ అనే హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఫలితంగా రొమ్ముల్లో సలపరం, మూడ్ స్వింగ్స్, ఒళ్లు బరువుగా ఉండడం లాంటి నెలసరి సమస్యలు వేధిస్తాయి.

శీతల పానీయాలు: ఇవి శరీరంలో నీటి నిల్వను పెంచుతాయి. మరీ ముఖ్యంగా నెలసరి సమయంలో వీటిని తాగడం వల్ల నెలసరి నొప్పులు మరింత పెరుగుతాయి.

కాఫీ: కెఫీన్ రక్తనాళాలను కుంచించుకుపోయేలా చేస్తుంది. కాఫీ తాగడం వల్ల గర్భాశయానికి వెళ్లే రక్తనాళం ఇరుకుగా మారి నెలసరి నొప్పి పెరుగుతుంది.

ఉప్పు: నెలసరి సహజ లక్షణమైన బ్లోటింగ్ ఉప్పుతో రెట్టింపవుతుంది. కాబట్టి ఉప్పుతో కూడిన చిప్స్ లాంటి పదార్థాలు తినకూడదు.

## మొలకలొచ్చిన ఉల్లి, వెల్లుల్లి తినొచ్చా?



మార్కెట్‌కు వెళ్తే తాజా కూరగాయల్ని చూసి కచ్చితంగా తీసుకోవాలనుకుంటాం. అయితే వాటిని ఫ్రిజ్‌లో పెట్టుకొని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది కాబట్టి పాడవుతాయనే సమస్య ఉండదు. ఉల్లిగడ్డలు, వెల్లుల్లిని కూడా కిలోల కొద్ది కొనుగోలు చేస్తుంటారు. అయితే వాటిని ఫ్రిజ్‌లో పెట్టే అవకాశం ఉండదు. ఎందుకంటే అలా పెడితే ఫ్రిజ్ అంతా దుర్వాసన వస్తుంది. మరి బయట పెడితే ఉల్లి, వెల్లుల్లిలో మొలకలు రావడం, ఆ మొలకెత్తిన భాగం పాడవడం గమనిస్తుంటాం. మరి ఎలా.. మొలకలు వచ్చిన ఉల్లి, వెల్లుల్లి తినొచ్చా? లేదా? అనే సందేహం అందరిలో కలుగుతుంది. నిపుణుల సూచనల ప్రకారం.. మొలకలు పెద్దగా అయితే ఉల్లి, వెల్లుల్లి పాడవుతుంది. అలాంటపుడు వాటిని వాడకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. మొలకలు కనుక అప్పుడప్పుడే వచ్చి ఉల్లి, వెల్లుల్లిలోని కొంత భాగం కనుక పాడయినట్లు గమనిస్తే దాన్ని తొలిగించి వంటల్లో వినియోగించుకోవచ్చని అంటున్నారు. దీని వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవని నిపుణులు చెబుతున్నారు.

## ఒత్తిడితో పాటు బరువు తగ్గాలంటే..



భారతీయ వంటకాలు, భోజనాల్లో నెయ్యిది ప్రత్యేక స్థానం. పాలు, పాల పదార్థాల నుంచి తీసే నెయ్యిలో స్వచ్ఛమైన కొవ్వు ఉంటుంది. అంతేకాదు... ఇందులో విటమిన్ ఎ, ఇ, కె2, డితో పాటు క్యాల్షియం, సీఎల్ఏ, ఒమేగా-3 వంటి మినరల్స్, ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలం. రోజూ ఓ క్రమ పద్ధతిలో నెయ్యి వాడితే మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చంటున్నారు న్యూట్రిషనిస్టులు.

ఇవీ ప్రయోజనాలు

గ్లాసు పాలలో చెంచాడు నెయ్యి, చిటికెడు పసుపు, నల్ల మిరియాల పొడి వేసుకొని తాగితే జీర్ణ వ్యవస్థను శుభ్రపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారించి శరీరానికి అవసరమైన రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుంది.

పసుపు, మిరియాల పొడితో నెయ్యిని జోడిస్తే కడుపులో మంటను తగ్గిస్తుంది. ఒత్తిడిని దూరం చేసి సుఖమైన నిద్రనిస్తుంది.

నెయ్యికి ఉన్న ఆయుర్వేద ప్రయోజనాల్లో ముఖ్యమైనది జీవక్రియ (మెటబాలిజమ్)ను మెరుగుపరచడంలో సహాయ పడుతుంది. మానసికోల్లాసాన్ని, శక్తిని ఇస్తుంది. బరువు తగ్గడంలో సహకరిస్తుంది.

ఇందులో బ్యుటిరిక్ యాసిడ్ అత్యధిక మోతాదులో ఉంటుంది. ఇది గట్‌లోని బ్యాక్టీరియాకు ప్రొబయాటిక్‌గా ఉపయోగపడుతుంది.

నెయ్యిలోని విటమిన్ కె2 ఎముకలు క్యాల్షియంను గ్రహించడానికి దోహదపడుతుంది. తద్వారా జాయింట్ పెయిన్ నుంచి ఉపశమనం కలుగుతుంది.

దీన్లోని సీఎల్ఏ ట్యూమర్స్, కొవ్వును తగ్గించి, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరిస్తుంది. ఆకలి పుట్టిస్తుంది.

ఇది గుర్తుపెట్టుకోండి

కూరలు, పప్పు తదితర వంటకాలు నెయ్యితో వండడంవల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. అయితే మధుమేహం, అధికబరువు, అధిక కొవ్వు, పీసీఓఎస్, హృదయ సంబంధిత సమస్యలు ఉన్నవారు పరిమితికి మించి నెయ్యి వాడకూడదు. అలాంటివారు వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం.



# బెంగాలీలో నాన్నకు ప్రేమతో రీమేక్




యంగ్ టైగర్ ఎన్టీఆర్ - సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన రివెంజ్ డ్రామా... నాన్నకు ప్రేమతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే గాక 2016 లో బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా నటించగా జగపతి బాబు ప్రధాన పాత్రను పోషించారు. అత్తారింటికి దారేది నిర్మాత బీవీఎస్ ఎన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పుడు విడుదలైన 5 సంవత్సరాల తరువాత ప్రసాద్ ప్రొడక్షన్ బెంగాలీ వెర్షన్ ని రెడీ చేసి విడుదల చేస్తోంది. నాన్నకు ప్రేమతో బెంగాలీలో రీమేక్ అయింది. ఇందులో ప్రముఖ బెంగాలీ హీరో జీత్ - ప్రముఖ నటి మిమి చక్రవర్తి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. బాజీ అనే టైటిల్ తో తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి అన్షుమన్ ప్రత్యూష్ దర్శకత్వం వహించారు. ఇది దుర్గా పూజ స్పెషల్ గా దసరా కానుకగా అక్టోబర్ 10 న విడుదల కానుంది.తండ్రి సెంటిమెంట్ తో తెరకెక్కి ఘనవిజయం సాధించిన నాన్నకు ప్రేమతో చిత్రంలో ఎన్టీఆర్... జగపతి బాబు నడుమ ఎమోషనల్ రివెంజ్ డ్రామా ఆకట్టుకుంటుంది. అదే ఎమోషన్ ని అంతే పర్ఫెక్ట్ గా బెంగాలీలోనూ ఎలివేట్ చేస్తున్నారని తెలిసింది.

## మూగ జీవాలంటే మెగా కోడలికి ఎంత ప్రేమ!



మెగా కోడలు ఉపాసన కొణిదెల సామాజిక మాధ్యమాల్లో అవేర్ నెస్ కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా ఉంటారన్న సంగతి తెలిసినదే. సమాజం లో మానవత్వం ఉన్న సెలబ్రిటీ గా తనవంతు పాత్రను పోషించడంలో ఎప్పుడూ ఉపాసన ముందుంటారు. మెగా ఇంట కోడలైన తర్వాత ఆ బాధ్యతలు మరింతగా పెరిగాయి. స్టార్ హీరో అర్ధనారిగా ఆయన చేయాల్సిన పనుల్ని సైతం తానే భాత్యతలు తీసుకుంటు ముందుకు సాగుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన బ్లండ్ బ్యాక్ క్యాపెనింగ్ కార్యక్రమాల్లో సైతం ఉపాసన పాల్గొంటున్నారు. చరణ్ పాన్ ఇండియా సినిమాల ప్రణాళికల్ని కూడా ఉపాసన చూస్తున్నారు.ఆ రకంగా మెగా అభిమానులకు మరింత దగ్గరయ్యారు. ఇది ఉపాసనలో ఒక కోణమైతే మూగ జీవాల పట్ల ఎంత ప్రేమగా మెలుగుతారు? అన్నది రెండవ కోణం. మూగజీవాలంటే ఉపాసన ప్రాణం పెడతారు. సమయం దొరికితే వాటితో గడపడానికి ఎక్కువగా ఇష్టపడతారు. అచ్చంగా చరణ్ లాగే ఉపాసన కూడా యానిమల్ లవర్. ఈ నేపథ్యంలో కొన్ని మూగజీవాలతో కాలక్షేపం చేస్తోన్న ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. ఆవులు..మేకలు..గెర్రెలు ఒంటెలు...గాడిదలు..గుర్రాలు..కుక్క పిల్లలతో ఓ పార్క్ లో ఇలా కాలక్షేపం చేస్తున్నారు. ఇక ఇంట్లో ఉపాసన తరుచూ కుక్కపిల్లలతో ఆడుకుంటూనే ఉంటారు.ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్ స్టాలో వైరల్ గా మారాయి. పాతవి..కొత్తవి అన్నింటిని కలిపి ఇలా ఒక చోట చేర్చి సోషల్ మీడియాలోకి వదిలినట్లు తెలుస్తోంది. ఇక ఉపాసనకు సినీ పరిశ్రమలో చాలా మంది స్నేహితులు ఉన్న సంగతి తెలిసిందే. మహేష్ సతీమణి నమ్రత శిరోద్కర్...బన్నీ భార్య స్నేహారెడ్డి..ఎన్టీఆర్ సతీమణి ప్రణతి అంతా ఒకోచోట కలిసి అప్పుడప్పుడు గెట్ టూ గెదర్ పార్టీలు ఏర్పాటు చేసుకుంటారు. కొన్ని సందర్భాల్లో వాళ్ల భర్తలు కూడా పాల్గొన్న సంగతి విధితమే.

## "బ్యాచ్ లర్" లో వెరీ ఇంట్రెస్టింగ్ పూజా హెగ్డే రోల్.!



పండుగ సమయం వస్తుంది అంటే టాలీవుడ్ లో సినిమాల హడావుడి ఎంతలా ఉంటుందో అందరికీ తెలిసిందే. మరి ఇప్పుడు రానున్న దసరా రేస్ లో రెడీగా ఉన్న పలు చిత్రాల్లో అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా నటించిన చిత్రం "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్" కూడా ఒకటి. ఎప్పుడు నుంచో అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్రం లో అఖిల్ పూజా జోడీపై మొదటి నుంచి ఇంట్రెస్టింగ్ చర్చలు వస్తూనే ఉన్నాయి.అయితే అసలు ఈ సినిమాలో పూజా వర్క్ ఎలా ఉంది తన రోల్ ఏంటి? ఎలా కష్టపడింది అన్న వాటిపై అఖిల్ మరియు దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ లేటెస్ట్ ఇంటర్వ్యూలో తెలిపారు. పూజా ఈ సినిమాలో ఒక స్టాండప్ కమెడియన్ రోల్ లో కనిపిస్తుందని భాస్కర్ తెలిపారు. అంతే కాకుండా ఆ రోల్ కి ఆమె సెట్టవుతుందా లేదా అన్న అనుమానాలు కూడా మొదట్లో ఉండేవి అని తెలిపారు.అలాగే సెట్స్ పూజా హెగ్డే చాలా ఎనర్జిటిక్ గా ఉంటుంది అని వర్క్ పరంగా చాలా సిన్సియర్ గా ఉంటుందని అలాగే తన రోల్ కి మొత్తం హార్ట్ ని పెట్టేసింది అని అఖిల్ చెప్పుకొచ్చాడు. అంతే కాకుండా ఓ సినిమా షూట్ నుంచి మరో సినిమా షూట్ కి అసలు గ్యాప్ లేకుండా పాల్గొనేది అని తాను చాలా వర్క్ హోలిక్ అని వారు తెలిపారు. మరి దీనిని బట్టి పూజా హెగ్డే రోల్ ఎలా ఉంటుందో తాను ఎంత కష్టపడుతుందో మనం అర్థం చేసుకోవచ్చు.

# బ్రేక్ ఈవెన్ దిశగా 'లవ్ స్టోరీ'



యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య - నేచురల్ బ్యూటీ సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం "లవ్ స్టోరీ". గతవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ రెస్పాన్స్ తో మంచి వసూళ్ళు రాబట్టి మ్యాజికల్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. కరోనా దెబ్బకు కుదేలైన సినీ పరిశ్రమ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో టాలీవుడ్ బాక్సాఫీన్ కు ఊపిరిపోసింది. పాండమిక్ తర్వాత అత్యధిక ఓపెనింగ్స్ రాబట్టిన సినిమాగా.. యూఎస్ఏ లో 1 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసిన మూవీగా 'లవ్ స్టోరి' రికార్డ్ క్రియేట్ చేసింది.'లవ్ స్టోరీ' మూవీ ఫస్ట్ వీక్ లో థియేటర్లలో మంచి కలెక్షన్స్ తెచ్చుకోవడంతో ట్రేడ్ వర్గాల్లో మళ్ళీ ఆశలు చిగురించాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ఓవర్2 సీస్ లో ఈ చిత్రం భారీ వసూళ్లు రాబట్టడం అందరికీ ఉపశమనం కలిగించింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో మొదటి నాలుగు రోజుల వసూళ్లతో పోల్చుకుంటే ఐదో రోజు మాత్రం కాస్త డ్రాప్ అయిందని తెలుస్తోంది. గులాబ్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా కలెక్షన్లు స్వల్పంగా తగ్గాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. కాకపోతే వానలు తగ్గుముఖం పట్టడంతో ఆరో రోజు వసూళ్ళు పర్వలేదనిపించాయి. ఈ క్రమంలో రెండో వారం అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మళ్లీ పుంజుకున్నాయని తెలుస్తోంది.'లవ్ స్టోరీ' చిత్రానికి వచ్చిన పాజిటివ్ మౌత్ టాక్ - మంచి రివ్యూలు రేటింగులు వంటివి రాబోయే వారాంతంలో ప్రేక్షకులను మళ్లీ థియేటర్లకు తిరిగి వెళ్లేలా చేసే అవకాశం ఉంది. అంతేకాదు ఈ సినిమా సక్సెస్ అవ్వాలని సినీ అభిమానులతో పాటుగా ఇండస్ట్రీ మొత్తం కోరుకుంది. విడుదలకు ముందే భారీ బజ్ క్రియేట్ అవడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ దాదాపు రూ. 31 కోట్ల మేర జరిగినట్లు తెలుస్తోంది. దీంతో 32 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్ పెట్టుకొని బరిలోకి దిగిన ఈ మూవీ అలవోకగా ఈ మార్క్ అందుకుంటుందని రిటర్న్స్ ని బట్టి అర్థం అవుతోంది. వచ్చే వారాంతంలో బాక్సాఫీస్ వద్ద 'లవ్ స్టోరీ' డ్రీమ్ రన్ సాధించే ఛాన్సెస్ ఉన్నాయి.దసరా పండుగ వరకు ఎలాంటి క్రేజీ సినిమా లేకపోవడం కూడా 'లవ్ స్టోరీ' చిత్రానికి సహాయపడుతుంది. లైంగిక వేధింపులు - కుల వివక్ష వంటి తీవ్రమైన సమస్యలను దర్శకుడు శేఖర్ కమ్ముల నిజాయితీగా తెరకెక్కించడం.. నాగ చైతన్య మరియు సాయి పల్లవిల అత్యుత్తమ నటన.. అద్భుతమైన సంగీతం వంటివి ఈ ప్రేమ కథా చిత్రం కోసం ప్రేక్షకులను ఆకర్షించే అంశాలని చెప్పవచ్చు. కాబట్టి రాబోయే రెండు వారాల పాటు 'లవ్ స్టోరీ' డ్రీమ్ రన్ కొనసాగుతుందని అనుకోవచ్చు.కాగా 'లవ్ స్టోరీ' చిత్రాన్ని సునీల్ నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ - అమిగోస్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రూపొందించారు. నారాయణ దాస్ కె. నారంగ్ - పి. రామ్మోహన్ రావు నిర్మాతలుగా వ్యవహరించారు. ప్రొడక్షన్ లోకి దిగిన తర్వాత ఏషియన్ సినిమాస్ వారికి ఇది ఫస్ట్ సినిమా. విజయ్ సి కుమార్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించగా.. పవన్ సీహెచ్ సంగీతం సమకూర్చారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ వర్క్ చేశారు. ఇందులో లీడ్ పెయిర్స్ తో పాటుగా రాజీవ్ కనకాల - దేవయాని - ఈశ్వరి రావు - ఉత్తేజ్ - చక్రపాణి - గౌరీ ప్రియ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

# 'పుష్ప' ఫస్టు పార్టు విలన్ ఫహాద్ కాదా?

అవినీతికి అడవిని మించిన అడ్డా లేదు .. అవినీతి పరులకు అడవిని మించిన ఆదాయ మార్గం లేదు. తమ అక్రమాలను అమాయకులైన గిరిజనులు ప్రశ్నించలేరు. వాళ్ల అన్యాయాలతో అక్కడి జంతువులకు పనిలేదు. అందువల్లనే అడవులు ఎక్కువగా కొల్లగొట్టబడుతూ ఉంటాయి. అడవి నేపథ్యంలో సాగే అక్రమాలకి సంబంధించిన కథలు రావు గోపాలరావు విలనిజం సమయంలో ఎక్కువగానే తెరపైకి వచ్చాయి. అడవి అనేదే అసలు ఇంట్రెస్టింగ్ పాయింట్ కనుక ఈ నేపథ్యంలో వచ్చిన కథలకు మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది.ఈ మధ్య కాలంలో కట్టెల కోసమే తప్ప కథల కోసం అడవుల వరకూ ఎవరూ వెళ్లడం లేదు. ఈ పొల్యూషన్ లో నుంచే కావలసినన్ని కథలను క్రియేట్ చేస్తున్నారు. కానీ ఎప్పుడూ కొత్తగా ఆలోచించే సుకుమార్ .. 'నాన్నకు ప్రేమతో' సినిమాను పూర్తిస్థాయిలో విదేశాల్లో చిత్రీకరించాడు. ఆ తరువాత 'రంగస్థలం' సినిమాను గ్రామీణ వాతావరణంలో తెరకెక్కించాడు. ఇక ఈ సారి ఇంకాస్త లోపలికి వెళ్లి అడవిలో జరిగే అక్రమాలతో పాటు అక్కడి అందాలను కూడా 'పుష్ప'గా తెరపై ఆవిష్కరించడానికి తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు.సుకుమార్ తన సినిమాలకు సంబంధించిన కథ .. స్క్రీన్ ప్లే .. మాటలను తనే వండుకుంటాడు. అందువలన సహజంగానే ఆలస్యమవుతూ ఉంటుంది. కరోనా కారణంగా ఈ సారి మరింత ఆలస్యమవుతోంది. ఈ సినిమా కథా పరిధి చాలా పెద్దది. అందువలన ఆయన ఈ సినిమాను రెండు భాగాలుగా అందించనున్నట్టు ముందుగానే చెప్పాడు. కథానాయికగా రష్మిక ఈ సినిమాలో గిరిజన యువతిగా కనిపించనుంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఆమె లుక్ ను చూసిన వాళ్లు ఇలాంటి అమ్మాయి తోడుంటే అడవి కూడా అందంగానే కనిపిస్తుందని అనుకుంటున్నారు. ఇక ఈ సినిమాలో ప్రతినాయకుడిగా ఫహాద్ ఫాజిల్ కనిపించనున్నాడు. ఆయన విలనిజం ఒక రేంజ్ లో ఉంటుందని చెప్పారు. నిజంగానే ఇటీవల వదిలిన ఆయన ఫస్టులుక్ కూడా అదే మాట చెప్పింది. అడవిలో ఇంతకుమించిన మృగాలు ఉండవంటూ ఇచ్చిన హింట్ ఆ పాత్రపైనా .. సినిమాపైన మరింతగా ఆసక్తిని పెంచుతూ పోతున్నాయి. అయితే ఈ సినిమా మొదటి భాగం షూటింగు చివరిలో ఫహాద్ జాయిన్ అయ్యాడు. ఆయన పాత్రపై ఎక్కువ రోజులు షూటింగు జరిగినట్టుగా కూడా సమాచారం లేదు. దాంతో ఫస్టు పార్టులో ఆయన ఎక్కువగా కనిపించడా? సెకండాఫ్ లో ఎంట్రీ ఇస్తాడా? అనే సందేహాలు కలిగాయి. ఈ విషయంలో సందేహానికి సమాధానంగా ఇప్పుడు ఒక టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా ఫస్టుపార్టు చివరిలో ఫహాద్ ఎంట్రీ ఉంటుందని అంటున్నారు. ఆయన ఎంట్రీపై ఫస్టు పార్టును ముగించి సెకండ్ పార్టుపై ఉత్కంఠను రేకెత్తిస్తారని అంటున్నారు. అయితే అప్పటివరకూ ఈ సినిమాలో విలన్ ఉండడా? అనే డౌటు రావడం సహజం. ఏ హీరో .. ఏ హీరోయిన్ ఇంతవరకూ తెరపై హాయిగా పాడుకున్నారు? ఎవరూ కూడా విలన్ టెన్షన్ తో 5 నిమిషాలకి మించి పాట పాడుకోలేకపోయారు. అలాగే ఫస్టు పార్టు చివరిలో ఫహాద్ ఎంట్రీ ఇచ్చేవరకూ మరో విలన్ ఉన్నాడు .. ఆ విలన్ ఎవరో కాదు సునీల్.తెలుగులో ఇంతవరకూ ముందుగా విలన్ .. ఆ తరువాత హీరోగా చేసిన వాళ్లు ఎక్కువ. కానీ సునీల్ తన రూటే వేరన్నట్టుగా వస్తున్నాడు. కమెడియన్ గా మెప్పించిన ఆయన ఆ తరువాత హీరోగా కొంతకాలం పాటు సందడి చేసి అక్కడి నుంచి విలన్ వేషాల వైపు కూడా ఓ లుక్కేస్తున్నాడు. అలా ఈ సినిమాలో ఆయన విలన్ పాత్రలో కనిపించనున్నాడని అంటున్నారు. ఇక ఆయన పాత్రను సుకుమార్ ఎలా డిజైన్ చేశాడనేది చూడాలి. 'క్రిస్మస్' కి ఈ సినిమాను విడుదల చేయనున్నారు. వసూళ్ల పరంగా ఈ సినిమా కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనే బలమైన నమ్మకంతో అభిమానులు ఉన్నారు.






Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com